PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 328 | విజయవాడ, మంగళవారం 2 జులై 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 2 July 2024 | Rs

సిటీ



ఏకైక టెస్టులో భారత్ జయభేరి

- దక్షిణాఫ్రికా మహిళలపై 10వికెట్ల తేడాతో గెలుపు

6



4న బంద్ జయప్రదం చేయాలి

- విద్యార్థి సంఘాల పిలుపు
- పోస్టరు ఆవిష్కరణ

3

నిరంకుశంగా ఆమోదింపజేసుకున్న

మూడు క్రిమినల్ చట్టాల అమలు నిలిపివేయాలి

సిపిఎం కేంద్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో)

పార్లమెంటులో ఎలాంటి చర్చ లేకుండా హడావుడిగా ఆమోదింపజేసుకున్న మూడు క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలని సిపిఎం కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది. నిరంకుశంగా, అప్రజాస్వామికంగా, ప్రతిపక్ష ఎంపీలను మూకుమ్మడిగా బహిష్కరించి ఈ చట్టాలు ఆమోదింపజేసుకున్న విషయాన్ని కేంద్రకమిటీ గుర్తుచేసింది. జూన్28 నుండి 30వరకు ఢిల్లీలో మూడు రోజులపాటు సమావేశమైన కేంద్ర కమిటీ ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. దేశ ద్రోహంపై ఐపిసి సెక్షన్ 124ఎ ని సుప్రీం కోర్టు కొట్టేసింది. అయితే, దానిని భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్ 156 ద్వారా కొత్త చట్టంలో ప్రభుత్వం చొప్పించింది. ఇది సర్వోన్నత న్యాయస్థానం తీర్పును ఉల్లంఘించడమే కాకుండా ఎవరినైనా సులభంగా దేశ ద్రోహులుగా ముద్ర వేయడానికి వీలు కల్పిస్తుంది. పౌరులకు హాని కలిగించే విస్తృతాధికారాలను ఈ కొత్త చట్టాలు పోలీసులకు కల్పిస్తున్నాయి. పాత చట్టం ప్రకారం 15 రోజులు మాత్రమే రిమాండ్‌కు న్యాయమూర్తి ఆదేశించగలరు. ఇప్పుడీ కొత్త చట్టం ప్రకారం 90 రోజుల వరకు రిమాండ్‌కు ఆదేశించవచ్చు. పదిహేను రోజుల పాటు దర్యాప్తు జరిపిన తరువాత ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు ఇది వీలు కల్పిస్తుంది. యుఎపిఎ(ఉపా) చట్టంలోని అనేక నిబంధనలు ఆందోళనకరంగా ఉన్నాయి. పాత చట్టం ప్రకారం ప్రభుత్వం ఇచ్చే ప్రాసిక్యూషన్ అనుమతితో సీనియర్ పోలీస్ అధికారి మాత్రమే ఈ కేసులను దర్యాప్తు చేయాలి. ఇప్పుడీ అధికారాన్ని సాధారణ పోలీస్ అధికారికి ఇచ్చారు.. నేరం జరిగినప్పుడు అమలులో ఉన్న చట్టం ప్రకారం తప్ప ఎవరినీ శిక్షించకూడదనేది ప్రాథమిక న్యాయ సూత్రం. జులై ఒకటి కన్నా ముందు నమోదయిన ఎఫ్ఐఆర్‌లకు పాత చట్టం వర్తిస్తుంది. ఆ తరువాత ఎఫ్ఐఆర్‌లకు కొత్త చట్టం వర్తిస్తుంది. ఒకే సమయంలో రెండు చట్టాలు అమలులో ఉండడం వల్ల వివాదాలు ఏర్పడతాయి. అప్పీళ్లను క్లిష్టతరం చేస్తుంది. కేసుల బ్యాక్‌లాగ్‌కు ఇది దారి తీస్తుంది. అనిశ్చితికి దారి తీసే ఈ అస్పష్టమైన నిబంధనలు ఆమోదయోగ్యం కాదని కేంద్ర కమిటీ పేర్కొంది. ఈ నిబంధనలకు వ్యతిరేకంగా బార్ అసోసియేషన్లు, పౌర సంస్థలు లేవనెత్తిన వైఖరికి మద్దతు పలికింది. వివిధ వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని వారిలో నెలకొన్న ఆందోళనలను పరిష్కరించేవరకు ఇటువంటి అణచివేత చట్టాల అమలును నిలిపివేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. భారత రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్య నిర్మాణాన్ని పరిరక్షించే పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. సమాఖ్య వ్యవస్థ, పౌర హక్కుల కోసం కూడా పోరాడాలి. దేశ పౌరుల్లో చాలా మంది జీవనోపాధికి సంబంధించిన తీవ్రమైన సమస్యను ఎదుర్కొంటున్నారు. వీటికోసం పార్లమెంటు లోపల, బయటా పోరాటం సాగిస్తామని తెలిపింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలను కేంద్ర కమిటీ సమావేశంలో కూలంకషంగా విశ్లేషించారు. ఎన్నికల్లో సిపిఎం ఫలితాలపైనా చర్చించారు. లోపాన్ని ప్రత్యేకంగా గుర్తించామని కేంద్ర కమిటీ తెలిపింది. లోటుపాట్లను అధిగమించి పార్టీ బలోపేతానికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపింది.

ఏప్రిల్‌లో అఖిల భారత మహాసభ

2025 ఏప్రిల్‌లో సిపిఎం 24వ అఖిల భారత మహాసభ నిర్వహించాలని పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయించింది. దీనికి ముందు అన్ని స్థాయిల్లో పార్టీ మహాసభలు ఈ ఏడాది సెప్టెంబరు నుండి జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన టైమ్ టేబుల్‌ను కేంద్ర కమిటీ ఆమోదించింది.

పూర్తి వివరాలు లోపలి పేజీలో

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే

నిజమైన సంక్షేమం

- ప్రతి కుటుంబానికి పెద్దకొడుకుగా ఉంటా
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- స్వయంగా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సమాజానికి చేయూనివ్వడానికి ముందడుగు వేస్తానని చెప్పారు.తమది ప్రజల ప్రభుత్వం అని అన్నారు. నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తామని, నిండు మనసుతో తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్వయంగా ముఖ్యమంత్రి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ అందించారు. ఉదయం 6 గంటలకే మంగళగిరి నియోజకవర్గం పెనుమాకలోని ఎస్టీ కాలనీకి చేరుకున్నారు. లబ్ధిదారులు బాణావత్ పాములు నాయక్ కుటుంబానికి మొదటగా చంద్రబాబు పింఛన్ అందించారు. నాయక్‌కు వృద్ధాప్య పింఛన్, కూతురు ఇస్లావతి బాయికి వితంతు పింఛన్, భార్య సీతాబాయికి రాజధాని కూలీ పింఛన్ అందించారు. అనంతరం వారితో కాసేపు ముచ్చటించారు. తనకు ఇల్లులేదని నాయక్ చెప్పడంతో తక్షణమే ఇంటి నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఎస్టీ కాలనీలో స్థానికుల యోగక్షేమాలను సిఎం అడిగి తెలుసుకున్నారు. అనంతరం మసీదు సెంటర్‌లో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో లబ్ధిదారులు, ప్రజలతో ముచ్చటించారు. ప్రజాస్వామ్యంలో న్యాయనిర్ణేతలు ప్రజలే అని ముఖ్యమంత్రి అన్నారు. గత ఐదేళ్లల్లో అణచివేతకు గురైన ప్రజలు ఇప్పుడు సమస్యలు చెప్పుకోవడానికి తనను కలుస్తున్నారని వివరించారు. ప్రజలకు తమపై చాలా ఆశలు ఉన్నాయని తెలిపారు. కానీ అన్నీ రాత్రికి రాత్రే జరిగిపోవని చెప్పారు. రాష్ట్రానికి ఎంత అప్పు ఉందో అర్థం కావడం లేదన్నారు. పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టాలంటే భయపడుతున్నారని అన్నారు. గత ముఖ్యమంత్రి ఎక్కడికి వెళ్లినా పరదాలు కట్టుకుని వెళ్లారని చెప్పారు. మురికి కాల్వ కూడా కనపడకుండా



పెనుమాకలో బాణావత్ పాములు కుటుంబానికి పెన్షన్‌తో పాటు శాశ్వత గృహ నిర్మాణ పత్రం అందజేస్తున్న చంద్రబాబు

తెరలు కట్టారని, సమస్యలు దాస్తే దాగవని తెలిపారు.

ప్రజలకు సేవకులమే

తాము ప్రజలకు సేవకులుగా ఉంటాం తప్ప పెత్తందారులుగా ఉండేవాళ్లం కాదన్నారు. తమకు ప్రజలు ఇచ్చింది అధికారం కాదని, బాధ్యత అని చెప్పారు. పరిపాలనలో తాము కష్టపడైనా సరే సంపద సృష్టించి ఆదాయం పెంచుతామని తెలిపారు. పెరిగిన ఆదాయాన్ని పేదలకు ఖర్చుచేసి పేదరికం లేని సమాజాన్ని తీసుకొస్తామన్నారు. జీవన ప్రమాణాలు పెంచడానికి మొదటి అడుగు వేశామని, ఆర్థిక అసమానతలు తగ్గించే వ్యవస్థకు రూపకల్పన చేస్తామన్నారు. ప్రతి ఇంటికి పెద్దకొడుకుగా ఉంటానని హామీనిచ్చారు. ఎన్నికల సమయంలో వాలంటీర్లతో పింఛన్ పంపిణీ చేయొద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చిందన్నారు. తాను సచివాలయ సిబ్బందితో పంచాలని చెబితే గత ప్రభుత్వం కుదరం దని చెప్పిందని గుర్తుచేశారు. వృద్ధులను సచివాల యాల చుట్టూ తిప్పి 33 మంది ప్రాణాలు తీశారని, ఇంటింటికీ పింఛన్ ఇవ్వాలని తాము పోరాడినా వినలేదన్నారు. అందుకే 1.20లక్షల మంది సచివాలయ సిబ్బందితో ఇప్పుడు అందిస్తున్నామని తెలిపారు. చేతకాదన్న అడ్మినిస్ట్రేషన్‌తోనే పింఛన్ల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. దేశంలోనే మొదటిసారి పింఛన్‌ను రూ.35లతో ఎన్టీ రామారావు ప్రారంభించారని చెప్పారు. ఇప్పుడు రూ.4వేలకు పెరిగిందని, ఇందులో రూ.2,875ల టిడిపి ప్రభుత్వమే దశలవారీగా పెంచిందన్నారు. ఒక్క నెలలోనే పేదలకు పింఛన్ల కింద రూ.4,408కోట్లు అందిస్తున్నామని, ఇంతకంటే శుభదినం మరొకటి లేదన్నారు. తవ్వుతున్న కొద్దీ నాటి ప్రభుత్వ తప్పులు, అప్పులు బయటపడు తున్నాయని చెప్పారు. పెరుగుతున్న ధరలకు కళ్లెం వేయాల్సి ఉందని, ధరలు తగ్గిస్తే పేద కుటుంబాలకు వెసులుబాటు లభిస్తుందన్నారు. ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీ మేరకు ఒకే రోజు ఐదు హామీలపై సంతకాలు చేశానని చెప్పారు. తమ ప్రభుత్వానికి మరింత శక్తినిస్తే మరింత సంక్షేమ అందిస్తుందని, అందరికీ అండగా ఉండే వెసుబాటును కల్పిస్తామని తెలిపారు. రాజధాని తరలిపోతుందని గతంలో ఇక్కడివారు బాధపడ్డారని, రాజధాని వస్తుందేమోనని విశాఖవాసులు భయపడ్డారని చెప్పారు. అధికారం ఉందని విర్రవీగితే ఏమవుతుందో గత పాలకుడికి పట్టిన గతిని చూస్తే తెలుస్తుందన్నారు. పోలవరం ప్రాజెక్టును గోదావరిలో ముంచింది కాక మళ్లీ అడ్డగోలు వాదనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరు అత్యాచారాలకు పాల్పడ్డా అదే చివరి రోజు అవుతుందని చెప్పారు. మద్యం గంజాయి మత్తులో ఏదిపడితే అది చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

ఇబ్బందులుంటే చెప్పండి : కోర్టులకు వెళ్లొద్దు

రోడ్లు వేసేటప్పుడు ఎవరికైనా ఇబ్బందులు ఉంటే తమతో చెప్పాలని చంద్రబాబు కోరారు. కోర్టులకు వెళితే పనులు ఆలస్యమవుతాయని తెలిపారు. తమ ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసమే ఆలోచిస్తుందన్నారు. ఎప్పుడూ జరగని అభివృద్ధి మంగళగిరిలో చూపిస్తానని తెలిపారు. గత ఎన్నికల్లో లోకేష్ మంగళగిరిలో ఓడిపోయారని వెల్లడించారు. అయినా పట్టు వదలకుండా మళ్లీ ఇదే నియోజకవర్గంలో పట్టు సాధించి ఎమ్మెల్యేగా గెలిచారని చెప్పారు. రాష్ట్రంలో మంచి కార్యక్రమాలు అమలు చేయడానికి, పేదిరకం లేని సమాజానికి పెనుమాక నుంచే సంకల్పం తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, కొండపల్లి శ్రీనివాస్, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంపిణీలో రికార్డు: చంద్రబాబు

రాష్ట్రప్రభుత్వం పింఛన్ల పంపిణీలో రికార్డు సృష్టించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క రోజులోనే 95శాతానికి పైగా ఇంటింటికీ పంపిణీ చేసి సరికొత్త రికార్డును సెట్ చేసిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికార యంత్రాంగాన్ని, పింఛన్ల పంపిణీలో పాల్గొన్న గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని అభినందించారు. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఒక్క రోజులో ఈ స్థాయిలో జరగలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రతిపక్షాల గొంతునొక్కేందుకే

కేంద్ర ఏజెన్సీల దుర్వినియోగం

- పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన
- లోక్‌సభలో నీట్‌పై చర్చకు పట్టు... నిరాకరించిన ప్రభుత్వం
- ప్రతిపక్షాల వాకౌట్



పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఇండియా ఫోరం ఎంపీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి. అందుకోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుందని ప్రతిపక్ష ఎంపిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలపై మోడీ ప్రభుత్వ వ్యవహారశైలికి నిరసనగా సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్ష ఇండియా వేదికకు చెందిన ఎంపిలు ఆందోళన చేశారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు హోరెత్తించారు. ప్రతిపక్షాలను మాట్లాడకుండా చేయడం కోసం.. వారిపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం ఆపాలని మోడీ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. అవినీతి చేసిన వారు బిజెపిలో చేరితే, వారికి అవినీతి చేసుకునేందుకు లైసెన్స్ ఇస్తోందని వారు విమర్శించారు. ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ఇండియా వేదిక నేతలు పాల్గొన్నారు.

లోక్‌సభలో నీట్‌పై చర్చకు పట్టు

లోక్‌సభ సమావేశాలు ఐదోరోజు వాడీవేడిగా కొనసాగాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే టి-20 ప్రపంచ కప్ గెలుపొందిన టీమ్ ఇండియాకు ఎంపిలంతా అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభించేందుకు అధికార పార్టీ నేత అనురాగ్ ఠాకూర్‌ను స్పీకర్ ఓం బిర్లా పిలిచారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సభలో నీట్ అవకతవకల అంశాన్ని ప్రస్తావించారు. ఈ అంశంపై మిగతా 5లో

కొత్త క్రిమినల్ చట్టాల కింద

వీధి వ్యాపారిపై తొలి కేసు

- అమిత్‌షా బుకాయింపు


న్యూఢిల్లీ : మూడు క్రిమినల్ చట్టాలు అమలులోకి వచ్చిన కొద్దిసేపటికే ఢిల్లీలో ఓ వీధి వ్యాపారిపై తొలి కేసు నమోదయింది. దీనిపై సోషల్ మీడియాలో దుమారం రేగడంతో ఆ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేశారు. కొత్త చట్టం కింద తొలి కేసును వీధి వ్యాపారిపై నమోదు చేయడంపై విమర్శలు వెల్లువెత్తడంతో ఎఫ్ఐఆర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆదేశాల మేరకు రద్దు చేశారు.. దీనిని కవర్ చేసుకోవడానికి అమిత్‌షా బుకాయింపులకు దిగారు. తొలి కేసు ఢిల్లీలో కాదని, గ్వాలియర్‌లో చోరీకి సంబంధించిన కేసు అని నమ్మబలికే యత్నం చేశారు. జూలై 1 అర్ధరాత్రి నుంచి మోడీ ప్రభుత్వం అమల్లోకి మూడు క్రిమినల్ చట్టాలను అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ చట్టాలు అమల్లోకి వచ్చాక దేశ వ్యాపితంగా వీధి వ్యాపారులపై పలు కేసులు నమోదయ్యాయని ది వైర్ తెలిపింది.

న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ సమీపంలో బీహార్‌కు చెందిన వీధి వ్యాపారి పంకజ్ కుమార్ పె పోలీసులు కేసు నమోదు చేశారు. కమలా మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో నమోదయిన ఎఫ్ఐఆర్ ప్రకారం రోడ్డు పక్కన బండిపై పొగాకు, నీరు విక్రయిస్తున్నారని, బాటసారులకు ఇబ్బంది కలిగిస్తున్నాడని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. బిఎన్ఎస్ సెక్షన్ 285 (పబ్లిక్‌వే లేదా నావిగేషన్ లైన్‌లో ప్రమాదాలు, అడ్డంకులు సృష్టించడం) కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేరం కనుక రుజువయితే రూ. 5 వేల జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధిస్తారు. దీంతోబాటు భారతీయ నాగరిక సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 173 కింద కూడా కేసు పెట్టారు. మధ్య ప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఆదివారం అర్ధ రాత్రి దాటిన తరువాత అంటే 12.16 గంటలకు కొత్త చట్టాల కింద ఒక కేసు నమోదయింది.. దీనికి 11 నిమిషాలకు ముందు జరిగిన ఘటనపై ప్రఫుల్ చౌహాన్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఎఫ్ఐఆర్ నమోదయింది. భోజనం తరువాత టీ తాగడానికి వెళితే అక్కడ టీ విక్రేత పాత వివాదాన్ని దృష్టిలో పెట్టుకుని తనపై దుర్భాషలు ఆడారని ప్రఫుల్ చౌహాన్ ఫిర్యాదు చేశాడు. దీంతో కొత్త చట్టం భారత న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్ 296 కింద పోలీసులు నమోదు చేశారు. అర్ధరాత్రి అయిన కొన్ని నిమిషాల తరువాత తన యమహా ద్విచక్ర వాహనం దొంగతనానికి గురయిందని సౌరబ్ నర్వరియా అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. గోవాలో కొబ్బరి కాయలు అమ్మే వీధి వ్యాపారిపై కొత్త చట్టం కింద కేసు నమోదయింది.

నీట్ రీ ఎగ్జామ్‌లో

ఎవరికీ దక్కని టాప్ ర్యాంక్

- 61కు తగ్గిన ఆల్ ఇండియా ర్యాంకర్ల సంఖ్య



న్యూఢిల్లీ : గత నెల చివరిలో జరిగిన నీట్-యుజి రీ ఎగ్జామ్‌లో ఫలితాలలను తాజాగా వెల్లడించగా, ఇందులో పాల్గొన్న ఎవ్వరికీ టాప్ ర్యాంక్ దక్కలేదు. దీంతో మే 5న జరిగిన నీట్-యుజి పరీక్షల్లో అక్రమాలు జరిగాయని నిర్ధారణ అయిందని విమర్శకులు, నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తాజా ఫలితాల్లో ఎవ్వరికీ టాప్ ర్యాంక్ లభించకపోవడంతో ఆల్ ఇండియా ర్యాంకర్ల సంఖ్య 61కు తగ్గింది. మే 5న నిర్వహించిన నీట్ యుజి పరీక్ష పెద్ద స్కామ్ అని దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిని రద్దు చేయాలని కూడా అభ్యర్థులు, ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నీట్ స్కామ్‌పై విచారణ ప్రారంభించిన సిబిఐ ఇప్పటికే ఆరుగుర్ని అరెస్టు చేసింది. నీట్-యుజి పేపర్ లీక్ అయిందని కూడా ప్రాథమిక విచారణలో గుర్తించింది. ఇలాంటి నేపథ్యంలో జూన్ 27న ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన 1,563 మంది అభ్యర్థులకు మరోసారి నీట్-యుజి పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే వీరిలో 813 మంది మాత్రమే రెండోసారి పరీక్షకు హాజరయ్యారు. ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, మేఘాలయాలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. ఈ ఫలితాలను ఆదివారం రాత్రి వెల్లడించారు. ఈ ఫలితాల్లో ఎవ్వరికి టాప్ ర్యాంక్ లభించలేదు. జూన్ 4న ప్రకటించిన గత నీట్ ఫలితాల్లో 720కు 720 మార్కులు సాధించిన అభ్యర్థులు ఎవ్వరూ కూడా ఈ సారి అదే మార్కులు సాధించలేకపోయారు. ముఖ్యంగా హర్యానాలో ఒక కేంద్రానికి చెందిన ఆరుగురు గత ఫలితాల్లో 720కు 720 మార్కులు సాధించారు. ఈసారి వీరిలో ఒక్కరికీ ఆ మార్కులు రాలేదు. తాజా ఫలితాలతో ఆల్ ఇండియా ర్యాంకర్ల సంఖ్య 61కు తగ్గింది. మే 5న జరిగిన నీట్ యుజి ఫలితాలను జూన్ 4న వెల్లడించగా, మొత్తం 67 మంది ఆల్ ఇండియా ర్యాంక్‌ను సాధించిన సంగతి తెలిసిందే.

నిర్మాణం...విధ్వంసం...పునర్నిర్మాణం

- సిద్ధమైన అమరావతి శ్వేతపత్రం
- మూడు భాగాలుగా రూపకల్పన
- రేపు విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిపై రెండవ శ్వేత పత్రాన్ని విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది విశ్వసనీయ సమాచారం మేరకు అధికారయంత్రాంగం ఇప్పటికే ఈ శ్వేతపత్రాన్ని సిద్ధం చేసింది. తుది మెరుగులు దిద్ది బుధవారం విడుదల చేయనున్నారు. మూడు భాగాలుగా ఈ శ్వేతపత్రాన్ని రూపొందిస్తున్నారు. 2014 నుండి 2019 వరకూ ఏమి చేశారు. 2019 నుండి 2024 వరకూ ఏం జరిగింది? 2024 నుండి చేయాల్సిందేమిటి? అన్న అంశాలు కీలకంగా ఉన్నట్లు తెలిసింది.

మొదటి భాగంలో 2014లో ప్రకటన చేసినప్పటి నుండి పూలింగు, రైతుల సహాయ సహకారాలు, అనంతరం ప్రపంచ వ్యాప్తంగా అమరావతి బ్రాండింగ్, నిధుల సమీకరణ అనే అంశాలను చేర్చారు. అలాగే రోడ్లు, పూలింగు ప్లాట్ల కేటాయింపులు, వాటిల్లో మౌలిక సదుపాయాలు, రోడ్లు సుమారు రూ.15 వేల కోట్లకు టెండర్లు, భవనాల ప్లాను, ఎజిసి కాంప్లెక్స్‌కు ర్యాఫ్ట్ వేయడం (గిన్నిస్ రికార్డు) వంటి అంశాలను ప్రస్తావించారు. వీటితోపాటు ప్రభుత్వ సిబ్బంది, ఉన్నతాధికారుల ఇళ్ల నిర్మాణం, ఎమ్మెల్యే క్వార్టర్స్, హైకోర్టు, ఇంటీరియమ్ గవర్నమెంటు కాంప్లెక్స్ (ఐజిసి) నిర్మాణం వంటి అంశాలను పొందుపరిచారు.



రెండోభాగంలో 2019 తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం సృష్టించిన విధ్వంసాన్ని ప్రస్తావించారు. తొలుత ప్రజావేదిక కూల్చివేత నుండి ప్రారంభించి మూడు రాజధానుల ప్రకటన, అనంతరం జరిగిన పరిణామాలను వివరించారు. ముఖ్యంగా రూ.9000 కోట్ల వ్యయంతో చేపట్టిన అనేక పనులను నిలిపేసినందువల్ల కలిగిన నష్టాన్ని పేర్కొన్నారు. రాజధాని నిర్మించి ఉంటే ప్రభుత్వానికి వచ్చే ఉపయోగాలు, ఆర్థిక స్వావలంభన, అంతర్జాతీయ గుర్తింపు వంటి వాటిని ఒక అంశంగా చేర్చారు. రాజధాని మొత్తం అటవీ ప్రాంతంగా మారడం, వీటిమాటున అప్పటికే నిర్మించిన రోడ్లను తవ్వేసి వాటి కంకర, ఇసుక, ఇనుప సామాన్లు దొంగిలించడం, ప్రశ్నించిన వారిని వేధించడం వంటి అంశాలను చేర్చారు. 2019 నాటికి పూర్తయిన భవనాలు వినియోగించకోకపోవడం వల్ల ధ్వంసమైన తీరు, ఆర్థిక నష్టాలను వివరించారు. ముఖ్యంగా రాజధాని మాస్టర్‌ప్లానును ఇష్టారాజ్యంగా మార్చడం వల్ల ఎదురైన ఇబ్బందులను ప్రస్తావించారు. ఇదే చాప్టర్లో రైతులు సుదీర్ఘంగా 1631 రోజులపాటు చేపట్టిన నిరసనల అంశాన్ని కూడా చేర్చినట్లు సమాచారం.

మూడోభాగంలో విశ్వనగరంగా అమరావతిని మార్చడం కోసం ఏమి చేయాలనే అంశాలను ప్రస్తావించారు. అప్పట్లో రూపొందించిన ప్లాను అమలుకు దాదాపు రూ.43 వేల కోట్లు ఖర్చవుతుందని, దీనికోసం నిధుల సమీకరణ, ప్రభుత్వ కార్యాలయాలు, సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ట్ నిర్మాణం వంటి అంశాలను చేర్చారు. విదేశీ పెట్టుబడులను సమీకరించాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించారు. ప్రస్తుతం ఉన్న భవనాలను వినియోగంలోకి తీసుకురావడం, రోడ్లు కనెక్టివిటీ చేపట్టడం, అమరావతికి బ్రాండింగ్ చేయడం తదితర అంశాలను కూడా ఈ భాగంలో చేర్చినట్లు తెలిసింది.



సి రామచంద్రయ్య



పి హరిప్రసాద్

ఎమ్మెల్సీలుగా రామచంద్రయ్య, హరిప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి శాసనమండలిలో ఖాళీ అయిన రెండు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. తెలుగుదేశం నుంచి సి రామచంద్రయ్య, జనసేన నుంచి పవన్‌కల్యాణ్ రాజకీయ కార్యదర్శి పి హరిప్రసాద్‌ను ఎంపిక చేశారు. మంగళవారం వీరిద్దరూ నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

డయాఫ్రం వాల్ క్షుణ్ణంగా పరిశీలన

- 'పోలవరం'లో అంతర్జాతీయ నిపుణుల బృందం బిజిబిజీ
- నేడు కేంద్ర, రాష్ట్ర అధికారులతో సమీక్ష

2

ముఖాముఖి చర్చించి పరిష్కరించుకుందాం

- విభజన సమస్యలపై తెలంగాణ సిఎంకు చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లయినా రెండు ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ఇంకా కొన్ని అంశాలు పరిష్కారానికి నోచుకోలేదని, వాటిని ముఖాముఖి చర్చించుకోవడం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ఈ మేరకు ఆరో తేదీ మధ్యాహ్నం చర్చలకు వెసులుబాటు కల్పించుకోవాలని కోరుతూ రేవంత్‌రెడ్డికి చంద్రబాబు లేఖ రాశారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పరిష్కారం కాకుండా అనేక సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని పరిష్కరించడం తెలుగు ప్రజలకూ, రాష్ట్రాలకూ ఉపయోగమని లేఖలో పేర్కొన్నారు. ఉమ్మడి అంశాల సామరస్య పరిష్కారానికి తాము ఎదురుచూస్తున్నట్లు లేఖలో ప్రస్తావించారు.

8న విద్యుత్‌పై శ్వేతపత్రం

- అధికారులతో సిఎం సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ రంగంపై ఈ నెల 8న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్వేతపత్రం విడుదల చేయనున్నారు. ఇందుకు సంబంధించిన అంశంపై ఇంధనశాఖ అధికారులతో ఉండవల్లిలోని తన నివాసంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. పదేళ్లలో విద్యుత్ రంగంలో జరిగిన, తీసుకొచ్చిన సంస్కరణలు, ఇతర అంశాలపై నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గత ఐదేళ్లలో ప్రజలపై వేసిన భారాలు, విద్యుత్ కొనుగోళ్లపై ఆరా తీశారు. విద్యుత్ రంగంలో అప్పులు పెరిగిపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. బయట మార్కెట్‌లో విద్యుత్ కొనడం, ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రాకపోవడంతో అప్పులు పెరిగాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ బకాయిలు పేరుకుపోవడంతో బయట నుంచి అప్పులు తీసుకురావాల్సి వచ్చిందని తెలిపారు. అప్పులు, ప్రజలపై వేసిన భారాలు, విద్యుత్ కొనుగోలు అంశాలపై నివేదికలు సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధరబాబు, డిస్కమ్‌ల సిఎమ్‌డిలు ఐ పృథ్వీతేజ్, కె సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి భార్య తీరుపై సిఎం ఆగ్రహం

రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి భార్య పోలీసులతో వ్యవహరించిన తీరుపై సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, పోలీసుల పట్ల మర్యాదతో మసులుకోవాలని హెచ్చరించారు. సోమవారం మంత్రి భార్య ఎస్‌ఐ పట్ల దురుసుగా ప్రవర్తించడంతోపాటు, అవమానకరంగా వ్యవహరించారు. ఎటువంటి ప్రొటోకాల్ లేని ఆమె తీరు సరికాదని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్లో మంత్రిని హెచ్చరించారు. మరోసారి ఇటువంటి ఘటనలు జరగకుండా చూసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

4 నుంచి టెట్‌కు దరఖాస్తు

- నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు ఈ నెల 4వ తేదీ నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. టెట్ సమాచార నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ సోమవారం విడుదల చేశారు. ఈ నెల 4 నుంచి 17వ తేదీ వరకు అభ్యర్థులు టెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించారు. పరీక్ష ఫీజును 3 నుంచి 16వ తేదీ వరకు చెల్లించవచ్చునని వివరించారు. ఆన్‌లైన్ మాక్‌టెస్ట్ ఈ నెల 16 నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు. 25వ తేదీ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. పేపర్-1ఎ, పేపర్-1బి, పేపర్-2ఎ, పేపర్-2బి పరీక్షలు ఆగస్టు 5 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు. మొదటి సెషన్ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆగస్టు 10వ తేదీన ప్రాథమిక 'కీ'ని విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ 'కీ'పై అభ్యంతరాలను ఆగస్టు 11 నుంచి 21వ తేదీ వరకు స్వీకరించి 25న తుది 'కీ'ను విడుదల చేస్తామని తెలిపారు. తుది ఫలితాలు 30న వెల్లడిస్తామన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలి

కార్మికశాఖ మంత్రికి సిఐటియు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) కోరింది. మంత్రికి ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు సోమవారం వినతిపత్రం సమర్పించారు. గత నాలుగున్నరేళ్లలో బోర్డును నిర్వీర్యం చేశారని, ఇప్పటికైనా ఆదుకోవాలని మంత్రిని నాయకులు కోరారు. దీనికి స్పందించిన మంత్రి మాట్లాడుతూ.. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడానికి అడ్డుగా ఉన్న 1214 జిఓను రద్దు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే కార్మిక సంఘాలతో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. ఇసుక క్వారీల నిలుపుదల అంశాన్ని పరిష్కరిస్తామని చెప్పారు. కార్మికుల రెన్యువల్స్‌ను పునరుద్ధరిస్తామన్నారు. నమోదు చేసుకున్న కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇస్తామని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు నాంపల్లి రమణరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, నాయకులు సుందరబాబు, ఈశ్వరరావు, స్కీం వర్కర్ల సంఘం నాయకులు కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

డయాఫ్రం వాల్ క్షుణ్ణంగా పరిశీలన

- 'పోలవరం'లో అంతర్జాతీయ నిపుణుల బృందం బిజీబిజీ
- దెబ్బతిన్న పనులు రెండో రోజూ పరిశీలన
- నేడు కేంద్ర, రాష్ట్ర అధికారులతో సమీక్ష



పోలవరం ప్రాజెక్టు వద్ద ఇసిఆర్‌ఎఫ్ గ్యాప్-2 పనులను పరిశీలిస్తున్న అంతర్జాతీయ నిపుణుల బృందం

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి, పోలవరం

పోలవరం ప్రాజెక్టులో దెబ్బతిన్న డయాఫ్రంవాల్‌ను అంతర్జాతీయ నిపుణుల బృందం సోమవారం క్షుణ్ణంగా పరిశీలించింది. ఇంజనీరింగ్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంది. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా అమెరికా, కెనడా నుంచి వచ్చిన నలుగురు సభ్యుల బృందం రెండో రోజు సోమవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో బిజీబిజీగా గడిపింది. రాజమండ్రి నుంచి ఉదయం 9.30 గంటలకు ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్న బృందం సభ్యులు ఎగువ, దిగువ కాపర్ డ్యామ్ కాంప్రహెన్షన్ పనులను, దెబ్బతిన్న డయా ఫ్రంవాల్, గైడ్‌బండ్, ఇసిఆర్‌ఎఫ్ డ్యామ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన మ్యాప్ పాయింట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ వరదలకు మూడు, నాలుగు చోట్ల దెబ్బతినడంతో ప్రాజెక్టు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. గతంలో డయాఫ్రం వాల్ నిర్మాణానికి రూ.450 కోట్లు వరకూ ఖర్చయితే, మళ్లీ పున:నిర్మాణానికి రూ.900 కోట్లకుపైగా ఖర్చు కానున్నట్లు అధికారులు చెబుతున్నారు. డయాఫ్రం వాల్‌ను మళ్లీ పూర్తి స్థాయిలో నిర్మించాలా? లేక దెబ్బతిన్న ప్రాంతాల్లో పనులు చేస్తే సరిపోతుందా? అనే విషయంపై సందిగ్ధత ఏర్పడింది. డయాఫ్రం వాల్ నిర్మాణంలోనే ప్రాజెక్టుకు గుండెకాయ వంటి ఇసిఆర్‌ఎఫ్ నిర్మాణం జరగాల్సి ఉంది. దీంతో డయాఫ్రం వాల్ నిర్మాణంపై ఏ విధంగా ముందుకు సాగాలనే దానిపై తేల్చేందుకే అంతర్జాతీయ నిపుణుల బృందాన్ని రప్పించారు. కమిటీ రెండు రోజులుగా ప్రాజెక్టు పనులను నిశితంగా పరిశీలించింది. కాఫర్ డ్యాం సీపేజ్ నుంచి వస్తున్న వాటర్ పనులు, దెబ్బతిన్న డయాఫ్రం వాల్, ఇసిఆర్‌ఎఫ్ గ్యాప్-2 పనులు, దెబ్బతిన్న గైడ్‌బండ్ పనులను అంతర్జాతీయ నిపుణుల బృందం పరిశీలించింది. ప్రాజెక్టు పనుల పరిశీలన పూర్తవడంతో మూడో రోజు మంగళవారం అధికారులతో సమావేశం కానుంది. రెండో రోజు ప్రాజెక్టు సందర్శనలో అంతర్జాతీయ నిపుణులు డేవిడ్ బి.పాల్, రిచర్డ్ డాన్నిలీ, గెయిన్ ఫ్రాన్‌కో డి కికో, సీన్ హించ్‌బర్గర్, పోలవరం ప్రాజెక్టు సిఇ నరసింహమూర్తి, ఇఇ మల్లికార్జునరావు, ప్రాజెక్టు గౌరవ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, సిడబ్ల్యుసి డిప్యూటీ డైరెక్టర్ అశ్వినీకుమార్, ఇంజనీరింగ్ చీఫ్ సి.నారాయణరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



వికలాంగురాలికి పింఛను అందిస్తున్న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్

మాది కక్ష సాధింపుల ప్రభుత్వం కాదు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, పిఠాపురం, అమరావతి బ్యూరో

గత ప్రభుత్వం మాదిరిగా తమది కక్ష్య సాధింపుల ప్రభుత్వం కాదని డిప్యూటీ సిఎం కొణిదల పవన్‌కళ్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఆయన సోమవారం పర్యటించారు. గొల్లప్రోలులో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నాశనం చేసిందన్నారు. అప్పుల్లో మునిగిపోయిన శాఖ బాధ్యతలు చూస్తూ జీతం తీసుకోవడం భావ్యం కాదని, వేతనాన్ని వదులుకున్నానని తెలిపారు. రాష్ట్రంలోని ఏ పరిశ్రమల నుంచి ఎంత మేర కాలుష్యం విడుదలవుతుందనే లెక్కలు తీయిస్తున్నానని, పరిశ్రమల నిర్వాహకులే కాలుష్య నియంత్రణ చర్యలు పాటించాలన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రంలో రూ.600 కోట్లు ఖర్చుపెట్టి రుషికొండను తవ్వేసి రాజమహల్ కట్టారని విమర్శించారు. దీంతో ఓ జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమయ్యేదని తెలిపారు. జల్ జీవన్ మిషన్ నిధులను గత ప్రభుత్వం వినియోగించుకోకపోవడంతో, గోదావరి పక్కనే ఉన్నా తాగునీరందని గ్రామాలు దర్శనమిస్తున్నాయన్నారు. కాకినాడలో బియ్యం మాఫియాను ప్రజలు కళ్లారా చూస్తున్నారని, గత ప్రభుత్వంలో జరిగిన తప్పులపై బాధ్యులకు శిక్ష పడాల్సిందేనని తెలిపారు.

జనసేన విప్‌లుగా నాయకర్, శ్రీధర్

జనసేనకు చెందిన నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, రైల్వే కోడూరుకు చెందిన అరవ శ్రీధర్‌ను అసెంబ్లీలో పార్టీ విప్‌లుగా నియమించాలని కోరుతూ పవన్‌కల్యాణ్ సోమవారం సిఎంకు లేఖ రాశారు. లేఖను ఆయన రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ మీడియాకు విడుదల చేశారు. చార్టర్డ్ అకౌంటెంట్లకు పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. వారి సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు.

24 శాతం హెచ్‌ఆర్‌ఎ పొడిగించాలి

- సిఎంను కలిసిన సెక్రటేరియట్ ఉద్యోగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సచివాలయం, హెచ్‌ఓడిల్లో పనిచేస్తున్న ఉద్యోగుల 24 శాతం హెచ్‌ఆర్‌ఎ గడువును పొడిగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం నాయకులు రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. సోమవారం వెలగపూడి సెక్రటేరియట్లో రామకృష్ణ ఆధ్వర్యాన సిఎం చంద్రబాబును ఉద్యోగులు కలిశారు. సచివాలయాల్లో, విభాగాధిపతుల కార్యాలయాల్లో వారానికి ఐదురోజుల పనిదినాల విధానాన్ని మరో ఏడాది పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడంపై ధన్యవాదాలు తెలిపారు. గత పిఆర్‌సి ప్రకటన సందర్భంగా సచివాయలం, హెచ్‌ఓడిల్లో పనిచేసే ఉద్యోగులకు 24 శాతం హెచ్‌ఆర్‌ఎ జూన్ నెలవరకూ ఇచ్చారు. దాన్ని పొడిగించాలని కోరారు. ఉద్యోగుల అభ్యర్థనపై సిఎం సానుకూలంగా స్పందించారు.

కొరటాల జీవితం స్ఫూర్తిదాయకం

- వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కొరటాల సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న ఎంవిఎస్ శర్మ తదితరులు

రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన కొరటాల సత్యనారాయణ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమైనదని ప్రజాశక్తి ఎడిటోరియల్ సలహాదారు ఎంవిఎస్ శర్మ పేర్కొన్నారు. ప్రజాశక్తి దినపత్రిక అభివృద్ధికి సాహితీ సంస్థ ఛైర్మన్‌గా కొరటాల ఎంతో కృషి చేశారని తెలిపారు. తాడేపల్లిలోని ప్రజాశక్తి భవన్‌లో కొరటాల సత్యనారాయణ 18వ వర్ధంతి కార్యక్రమం సోమవారం జరిగింది. ప్రజాశక్తి దినపత్రికగా ఈ స్థాయిలో అభివృద్ధికావడానికి కొరటాల సత్యనారాయణ ఎంతో కృషి చేశారని తెలిపారు. అన్ని తరగతుల ప్రజల ఆదరణను చూరగొనేలా పత్రికను తీర్చిదిద్దేందుకు పత్రికను ప్రజాబాహుళ్యంలోకి విస్తృతంగా వెళ్లేలా పనిచేశారని అన్నారు. కార్యకర్తలను ఎంతో ఆప్యాయంగా చేరదీసి, వారిని అభివృద్ధి చేయడం కొరటాల ప్రత్యేకత అని కొనియాడారు. చేనేత, రైతు, వ్యవసాయ కార్మికులు, పత్రికా ఇలా ప్రతిరంగంపై ఆయన చెరగని ముద్ర వేశారని, ఆయన ఆశయ సాధన కోసం ప్రజాశక్తి సిబ్బంది కృషి చేయాలని కోరారు.

రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన..

రాష్ట్రంలో రైతు, వ్యవసాయ, చేనేత కార్మిక సంఘాల ఉద్యమ సారధి కొరటాల సత్యనారాయణ 18వ వర్ధంతి కార్యక్రమం వడ్డేశ్వరంలోని కొరటాల-బాపనయ్య భవన్(కెబి భవన్)లో ఘనంగా జరిగింది. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, నాయకులు శివనాగరాణి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర గాయకులు జగన్, ఐద్వా నాయకులు శ్రీనివాసకుమారి తదితరులు కొరటాల సత్యనారాయణకు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రంలో బలమైన ప్రజా ఉద్యమాల నిర్మాణమే కొరటాల సత్యనారాయణకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

ఎఎన్‌యు విసి రాజశేఖర్ రాజీనామా

ప్రజాశక్తి- ఎఎన్‌యు (గుంటూరుజిల్లా)

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు లేఖను ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్యకోలేకి అందజేశారు. రాజకీయ వివాదాల నేపథ్యంలో రాజశేఖర్ గత మూడు రోజుల క్రితమే రాజీనామా చేసినట్టు మీడియాలో ప్రచారం జరిగినా సోమవారం అధికారికంగా రాజీనామా లేఖను రిజిస్ట్రార్ ద్వారా ప్రభుత్వానికి పంపారు.

ఎసిబి డిజిగా అతుల్ సింగ్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవినీతి నిరోధకశాఖ (ఎసిబి) డిజిగా అతుల్ సింగ్ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఆర్‌టిసి హౌస్‌లో ఉన్న ఎసిబి కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

రాష్ట్రంలో పింఛన్ల పండగ : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పింఛన్ల పండగ వాతావరణం నెలకొందని టిడిపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 18 రోజుల్లోనే హామీని తమ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. రాష్ట్రంలో 65 లక్షల మంది పింఛనుదారులకు ఒకేసారి రూ.7 వేల చొప్పున పింఛన్లు ఇవ్వడం దేశ చరిత్రలో అరుదైన రికార్డు అని చెప్పారు. మాజీ సిఎం వైఎస్ జగన్ విధ్వంసక పరిపాలన, అస్తవ్యస్త ఆర్థిక వ్యవస్థను చంద్రబాబు చక్కదిద్దుతూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని తెలిపారు. రాజకీయ ప్రేరేపిత వలంటీర్ వ్యవస్థను కేవలం రాజకీయ ప్రయోజనాలకే వాడుకుంటూ పింఛనుదారులను జగన్ బెదిరిస్తూ బ్లాక్ మెయిల్ చేశారని విమర్శించారు.


స్వగ్రామాలకు వీరజవాన్ల భౌతిక కాయాలు

సైనిక, పోలీస్ లాంఛనాలతో ఇద్దరి అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి- యంత్రాంగం, అమరావతి బ్యూరో

జమ్మూకాశ్మీర్‌లోని లద్దాక్ వద్ద నది దాటే ప్రయత్నంలో జరిగిన ప్రమాదంలో వీర మరణం పొందిన మన రాష్ట్రానికి చెందిన ముగ్గురు సైనికుల భౌతికకాయాలను సైనిక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి మిలటరీ అధికారులు సోమవారం తీసుకొచ్చారు. అక్కడి నుంచి మృతదేహాలను స్వగ్రామాలకు తరలించారు. అనంతరం సైనిక, పోలీసు లాంఛనాలతో స్వగ్రామాల్లో వారిలో ఇద్దరి అంత్యక్రియలు పూర్తయ్యాయి. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కాల్వపల్లె గ్రామానికి చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి (జెఇఒ) ముత్తుముల రామకృష్ణారెడ్డి (47), కృష్ణా జిల్లా పెడన మండలం చేవెంద్రకు చెందిన సాగరబోయిన నాగరాజు (32), బాపట్ల జిల్లా రేపల్లె మండలం కైతేపల్లి పంచాయతీ ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన శుభాన్ ఖాన్ (40) భౌతికకాయాలను అధికారిక లాంఛనాలతో గన్నవరం విమానాశ్రయం నుంచి స్వగ్రామాలకు తరలించారు. వీర జవాన్లకు మిలటరీ అధికారులు రెడ్ సెల్యూట్ చేశారు. వాస్తవాధీన రేఖ సమీపంలో టి-72 యుద్ధ ట్యాంకులో వెళుతున్నప్పుడు లేహక్‌కు 148 కిలోమీటర్ల దూరంలో ఈ ముగ్గురు జవాన్లు ప్రయాణిస్తున్న ట్యాంక్ శ్యోక్ నదిలో కొట్టుకుపోయింది. మంచు కరిగిపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

నాగరాజుకు ఐదేళ్ల కిందట వివాహమైంది. ఏడాది పాప ఉంది. నాగరాజు సోదరుడు శివయ్య కూడా సైనికుడిగా సేవలందిస్తున్నారు. నాలుగు రోజుల కిందట కుమార్తె పుట్టిన రోజు వేడుకలను వీడియో కాల్‌లో నాగరాజు చూసి కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడిపారు. అంతలోనే దుర్మరణం చెందడంతో కుటుంబం కన్నీరుమున్నీరైంది. సుభాన్ ఖాన్ 17 ఏళ్ల కిందట సైనికుడిగా చేరి అంచెలంచెలుగా హవల్దార్ స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం ఇఎంఇ మెకానిల్ విభాగంలో పనిచేస్తున్నారు. రెండేళ్లలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా వీరమరణం చెందడంతో స్వగ్రామం కైతేపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.



గన్నవరం విమానాశ్రయంలో వీరజవానులకు సెల్యూట్ చేస్తున్న అధికారులు

ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. జులై 7న స్వగ్రామానికి వచ్చేందుకు విమానం టికెట్ బుక్ చేసుకున్నారు. ఇంతలో విషాదం చోటుచేసుకుంది. ఇస్లాంపూర్‌లో సుమారు వంద ఇళ్లు ఉండగా దాదాపు ప్రతి ఇంటి నుంచి ఇద్దరు సైనికులుగా ఎంపికయ్యారు. వీరిలో కొందరు పదవీ విరమణ చేశారు. నాగరాజు, సుభాన్ ఖాన్ అంత్యక్రియలు సైనిక, పోలీస్ లాంఛనాలతో పూర్తయ్యాయి.

నేడు రామకృష్ణారెడ్డి అంత్యక్రియలు

రామకృష్ణారెడ్డి ఏడు నెలల్లో రిటైర్డ్ కానుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆయన తండ్రి రామస్వామిరెడ్డి ఆర్మీ జవాన్‌గా పనిచేసి రిటైరయ్యారు. రామకృష్ణారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రిటైర్‌మెంట్ అనంతరం నివాసం ఉండేందుకు కాల్వపల్లెలో నూతన గృహాన్ని నిర్మించుకున్నారు. గృహప్రవేశం జరగకుండానే వీరమరణం పొందడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతి చెందారు. మంగళవారం ఉదయం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

సైనికుల మరణం కలచివేసింది: సిఎం చంద్రబాబు

లడ్డాఖ్‌లో యుద్ధ ట్యాంకు కొట్టుకుపోయిన ఘటనలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు సైనికులు చనిపోయారన్న ఘటన తనను కలచివేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం ప్రకటించారు. విధి నిర్వహణలో దేశ సరిహద్దులో ప్రాణాలు కోల్పోయిన సైనికులు ముత్తుముల రామకృష్ణారెడ్డి, సాదరబోయిన నాగరాజు, సుభాన్ ఖాన్ మృతి పట్ల సోమవారం నివాళులర్పించారు. జవాన్ల మృతి పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి మృతి బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.

అరకు కాఫీ రైతుల నష్టాన్ని విస్మరించిన మోడీ

- మన్‌కీబాత్‌పై సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆదివాసీ రైతుల కృషితో ఆర్గానిక్ కాఫీ సాగువల్ల అంతర్జాతీయ స్థాయిలో అరకు కాఫీ గుర్తింపు పొందిందని, దీన్ని మోడీ మన్‌కీబాత్‌లో గుర్తించకపోవడం అన్యాయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులను విస్మరించి కాఫీ సాగు గురించి మాట్లాడటం మోసం చేయడమేనని సిపిఎం రాష్ట్ర కమిటీ భావిస్తోందని తెలిపారు. దేశ ప్రధాని మోడీ మన్‌కీబాత్‌లో చంద్రబాబు నాయుడుతో కాఫీ తాగిన ఫోటోను పోస్ట్‌చేసి, అరకు కాఫీ ఆర్గానిక్ కాఫీ రుచికి శ్రేష్టమైనదని, జి20 సదస్సుకు హాజరైన అందరికీ అరకు కాఫీ అందించామని, అందురూ అద్భుతమని కొనియాడారని మోడీ పేర్కొన్నారని తెలిపారు. అంత అద్భుతమైన కాఫీని పండిస్తున్న 1.5 లక్షల మంది రైతుల శ్రమ, గిట్టుబాటు ధర గురించి ప్రస్తావించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. దేశంలో పర్యావరణ సమతుల్యత కోసం గిరిజన ప్రాంతాల్లో పండే కాఫీ పంట, దీనికి విశాఖ ఏజెన్సీ అనువైనదని తెలిపారు. 1982 నుండి విశాఖ ఏజెన్సీలో కాఫీ, సిల్వర్ ఓక్ సాగును ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని, పోడు వ్యవసాయానికి స్వస్తిపలికి కాఫీ, మిరియాలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో గిరిజనులు వారి ఆర్థిక అవసరాలు తీర్చుకుంటున్నారని వివరించారు. ఆదివాసీ కాఫీ రైతులకు గిట్టుబాటు ధర లేక దళారుల చేతుల్లో తీవ్రంగా మోసపోతున్నారని, వాతావరణం అనుకూలించనప్పుడు కాఫీ పంటరాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అరకు పంటకు కేంద్రం కనీసం ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించలేదని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం పది సంవత్సరాల నుండి కాఫీ రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలు తగ్గించేసిందని వివరించారు. 2018 నుండి ఇవ్వాల్సిన రూ.62 కోట్లు ప్రోత్సాహాన్ని ఇవ్వకుండా మొండి చేయి చూపించిందని వివరించారు. కేంద్ర విధానాల వల్ల ఎపిఎఫ్‌డిసి, కాఫీ ఎస్టేట్‌లు మూతపడుతున్నాయని, బోర్డును నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. ఫలితంగా గిరిజనులు ఉపాధి కోల్పోతున్నారని, గిరిజన భూముల్లో పండిస్తున్న కాఫీ తోటల్లో ఉపాధి పథకం కింద పనిచేస్తున్న పనులు కూడా నిలిపేశారని, ఉపాధి నిధులు కేటాయించకుండా గిరిజనులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. జిసిసి ద్వారా కాఫీ గింజలు కొనుగోలు చేయాలని, జిసిసికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో రైతుల నుండి తక్కువ కాఫీ గింజలు కొంటోందని పేర్కొన్నారు. దీనివల్ల దళారులు, స్వచ్ఛంధ సంస్థలు ఇష్టారాజ్యంగా తక్కువ ధరకు కొనుగోలు చేసి గిరిజనులకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. ప్రధాని మోడీకి అరకు కాఫీపై ప్రేమ ఉంటే నిధులు కేటాయించి రైతులను ఆదుకోవాలని కోరారు. కాఫీ బోర్డుకు, ఎపిఎఫ్‌డిసి, జిసిసిలకు తగిన నిధులు కేటాయించి బలోపేతం చేయాలన్నారు.

ఎడిసి ఛైర్మన్‌గా లక్ష్మీపార్థసారథి బాధ్యతల స్వీకరణ

- పలువురి అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎడిసి) ఛైర్మన్‌గా నియమితులైన లక్ష్మీపార్థసారథి సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ కేదారేశ్వరపేటలోని ఎడిసి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమెకు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ నుండి ఆమె సిఆర్‌డిఎ కార్యాలయానికి చేరుకుని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణను కలిశారు. అక్కడ నుండి నేరుగా ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఎడిసి ఏర్పాటు చేసినప్పటి నుండి ఛైర్మన్‌గా ఉన్న లక్ష్మీపార్థసారథి రాజధాని నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. అభివృద్ధి పనులు, ప్రాజెక్టులకు నిధుల సమీకరణ వంటి అంశాలపై చురుకుగా వ్యవహరించారు. 2019 నుంచి ఆ బాధ్యతలకు దూరంగా ఉన్న ఆమెను 2024లో టిడిపి అధికారంలోకి రావడంతో మళ్లీ నియమించారు. ప్రాజెక్టులపై అవగాహన ఉన్న లక్ష్మీపార్థసారథి అయితే అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భావించి వెంటనే మరలా ఛైర్‌పర్సన్‌గా నియమించారు. ఆమెను కలిసిన వారిలో ఎడిసి చీఫ్ ఇంజినీరు ధనుంజయ, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

టిడిపి కార్యాలయంపై దాడికేసు విచారణ

- సిసి కెమెరాలను పరిశీలించిన పోలీసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వ హయాంలో మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి జరిగిన ఘటనలో పోలీసులు ఇప్పుడు విచారణ ప్రారంభించారు. 2021 అక్టోబరు 19న వైసిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వెళ్లి కార్యాలయం ప్రధాన గేట్లను ధ్వంసం చేసి కార్యాలయంలోకి ప్రవేశించి అడ్డొచ్చిన వారిపై దాడి చేసిన ఘటనపై టిడిపి వెంటనే ఫిర్యాదు చేసినా ఏమాత్రం స్పందించని పోలీస్‌శాఖ ప్రభుత్వం మారగానే ఇప్పుడు విచారణను మొదలు పెట్టడం చర్చనీయాంశమైంది. నాటి సిఎం జగన్‌ను టిడిపి నేత పట్టాభి వ్యక్తిగతంగా విమర్శలు చేశారని వైసిపి శ్రేణులు ఈ దాడులకు పాల్పడ్డట్లు విమర్శలు వున్నాయి. టిడిపి కార్యాలయం ఆవరణలో వున్న కార్లను, కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంతోపాటు పట్టాభి ఇంటిపై కూడా దాడి చేశారు. పట్టాభి నివాసంలో విలువైన వస్తువులు, ఫర్నీచర్ ధ్వంసం చేసి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేశారు. ఈ కేసులు అప్పుడు రాష్ట్రంలో సంచలనం సృష్టించినా పోలీసులు విచారణ జరపకుండా కేసును అటకెక్కించారు. సోమవారం పోలీసులు టిడిపి కార్యాలయానికి వెళ్లి అక్కడ వున్న సిబ్బందిని దాడి జరిగిన తీరుపై విచారించారు. అలాగే కార్యాలయం లోపల, బయట వున్న అన్ని సిసి టివి ఫుటేజ్‌లను సేకరించారు. దాడికి పాల్పడ్డ వారిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. వైసిపి నేతలు దేవినేని అవినాష్, లేళ్ల అప్పిరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి అనుచరులే దాడులకు తెగపడ్డారంటూ టిడిపి శ్రేణులు చెబుతున్నాయి.

ప్రభుత్వ నిబంధనలు అదానీ భేఖాతర్

- కంటైనర్ టెర్మినల్ సేవలు పునరుద్ధరించాలి : సిఐటియు

ప్రజాశక్తి- నెల్లూరు



కంటైనర్ టెర్మినల్ అనుమతి పత్రాలను చూపిస్తున్న శ్రీనివాసులు

పక్క రాష్ట్రానికి తరలించిన కృష్ణపట్నం పోర్టుకు సంబంధించిన కంటైనర్ టెర్మినల్ సేవలను తిరిగి మరలా జిల్లాలో పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం నెల్లూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, జిల్లా నాయకులు గోగుల శ్రీనివాసులు మాట్లాడారు. కృష్ణపట్నం పోర్టులో ప్రధాన విభాగమైన కంటైనర్ టెర్మినల్‌లో సుమారు 15 వేల మందికి ఉద్యోగం, ఉపాధి లభిస్తుందని తెలిపారు. అటువంటి విభాగాన్ని ప్రభుత్వ నియమనిబంధనలకు, పర్యావరణ, పరిరక్షణ శాఖ నుంచి 2008 తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా మరో రాష్ట్రానికి తరలించడం దుర్మార్గమన్నారు. అదానీ యాజమాన్యం పోర్టును నిర్వీర్యం చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని వివరించారు. పోర్టు ఏర్పాటైతే తమ బిడ్డలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్న ఆశతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భూములను ఆనాడు ఇచ్చారని, నేడు అదానీ యాజమాన్యం నిర్ణయం వల్ల వారి ఆశలు అడియాశలయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పోర్టు పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించే క్రమంలో తనకు ఓట్లు వేసి గెలిపిస్తే ఇక్కడి నుంచి మరో రాష్ట్రానికి తరలిపోయిన కంటైనర్ టెర్మినల్‌ను తిరిగి తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ పోర్టును సందర్శించారని తెలిపారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానానికి కట్టుబడి కృష్ణపట్నం పోర్టుకు కంటైనర్ టెర్మినల్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు అవసరమైతే అదానీ కాళ్లు పట్టుకొని వేడుకుంటానని చెప్పడం సరికాదన్నారు. నిబంధనలను అతిక్రమించి, పోర్టులోని బెర్తులను ఇష్టానుసారంగా వాడుకుంటుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పోర్టుకు వెళ్లినప్పుడు అదానీని వేడుకుంటూమంటూ, కాళ్లు పట్టుకుంటామంటూ చెప్పడం సరికాదన్నారు. తక్షణమే పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను తిరిగి పునరుద్దరించేలా చూడాలని సిఐటియు డిమాండ్ చేస్తోందన్నారు.

10న డిమాండ్స్ డే : సిహెచ్ నరసింగరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు జులై పదో తేదీన జరగనున్న డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు కోరారు. సోమవారం విజయవాడ బాలోత్సవ భవన్లో కె నాగభూషణం అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కార్మికుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ తీరును ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు కూడా మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సోమయ్య, బలరామ్, వెంకటరావు, ముత్యాలరావు, నరసయ్య, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.



అడవి పాలెం గ్రామంలో స్వయానా వృద్ధురాలు కాళ్లు కడుగుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

వృద్ధుల కాళ్లు కడిగి పింఛన్లు అందజేత

ప్రజాశక్తి - యలమంచిలి

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం అడవిపాలెం, యలమంచిలి, కాజ పడమర, కొంతేరు తదితర గ్రామాల్లోని వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్ లబ్ధిదారులకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం పింఛను సొమ్ము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి బాధ్యతారాహిత్య పరిపాలన కారణంగా రాష్ట్ర ఖజానాలో చిల్లి గవ్వలేదని తెలిపారు. ఈ పరిస్థితుల్లోనూ ఇచ్చిన మాట ప్రకారం తమ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పింఛన్ సొమ్ము పెంపు చేశారన్నారు. అడవిపాలెం గ్రామంలో మంత్రి రామానాయుడు స్వయానా వృద్ధుల కాళ్లు కడిగి వారికి పింఛన్లు అందజేశారు.

రాయలసీమ యూనివర్సిటీ విసి రాజీనామా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి పంపారు. ఈ ఏడాది జనవరిలో వర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నియమితులైన అన్ని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు తమ పదవులకు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్న క్రమంలో సుధీర్ ప్రేమ్‌కుమార్ కూడా తన పదవి నుంచి తప్పుకున్నారు. రెండు రోజుల క్రితం రిజిస్ట్రార్ నాగుల అంకన్న కూడా రాజీనామా చేశారు.

'ఆ' అధికారులపై ఆరా

- జివిడి నుంచి పలు శాఖలకు సర్క్యులర్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. వారికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆ అధికారుల ఇ-మెయిల్స్, ఫోన్ నంబర్లను అందించాలని సంబంధిత శాఖలకు సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిసింది. 2019 నుంచి 2024 వరకు వివిధ శాఖల్లో పనిచేసిన కొంతమంది ఐఎఎస్ అధికారులు, ఇతర అఖిల భారత సర్వీసు అధికారులు, ద్వితీయ శ్రేణి అధికారులపై ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో అనుసరించిన విధానాల వల్ల ఖజానాకు భారీగా నష్టం వాటిల్లినట్లు కూడా తాజాగా ప్రభుత్వం చెబుతోంది. ఇందులో మద్యం శాఖ, సమాచారశాఖ, గనుల శాఖ, పంచాయతీరాజ్, డిజిటల్ కార్పొరేషన్, ఫైబర్‌నెట్ వంటి శాఖలపై ఆరోపణలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది అధికారులను బదిలీ చేసిన ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాలని ఆదేశించగా, ఇంకొంతమందిని సెలవుపై వెళ్లాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ శాఖలకు సంబంధించిన అధికారులు ప్రస్తుతం వినియోగిస్తున్న అధికారిక మెయిల్‌తోపాటు, వారి సొంత మెయిల్స్ ఏమైనా ఉంటే వాటి వివరాలను సమర్పించాలని ఆ శాఖల్లోని ప్రస్తుత ఇన్‌ఛార్జ్‌లకు సాధారణ పరిపాలన శాఖ నుంచి మెమోలు వెళ్లినట్లు తెలిసింది. అలాగే ప్రభుత్వం ఇచ్చిన అధికారిక మొబైల్ నంబర్‌తోపాటు వారు వినియోగిస్తున్న సొంత, ప్రయివేటు నంబర్ల వివరాలు కూడా ఆరా తీస్తోంది.

చిన్నారిపై లైంగికదాడి

ప్రజాశక్తి -మధురవాడ (విశాఖపట్నం)

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన విశాఖపట్నం జిల్లా మధురవాడ పరిధి మల్లయ్యపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. దిశ ఎసిపి సిహెచ్ వివేకానంద తెలిపిన వివరాల ప్రకారం... జివిఎంసి 7వ వార్డు మల్లయ్యపాలేనికి చెందిన పోలిపల్లి తరుణ్ (19) ఆదివారం సాయంత్రం ఆదే గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఇచ్చి తాము ఉంటున్న మేడపైకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎసిపి వివేకానంద తెలిపారు.

ఢిల్లీ హైకోర్టులో కేజ్రీవాల్ పిటీషన్

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సిబిఐ తనను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీ హైకోర్టులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సోమవారం పిటీషన్ దాఖలు చేశారు. సిబిఐ కస్టడీ విధించడాన్ని కూడా కేజ్రీవాల్ తన పిటీషన్‌లో ప్రశ్నించారు. జస్టిస్ నీనా బన్సాల్ కృష్ణ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటీషన్‌ను మంగళవారం విచారించే అవకాశం ఉంది. ఈ కేసులో ఇడి కేజ్రీవాల్‌ను మార్చి 21న అరెస్టు చేయగా, స్థానిక కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. అనంతరం సిబిఐ ఆయనను అరెస్టు చేసింది. ప్రస్తుతం సిబిఐ కస్టడీలో కేజ్రీవాల్‌ను ఉన్నారు. తన లాయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భేటీ అయ్యే అవకాశం కల్పించాలని కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటీషన్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు సోమవారం తిరస్కరించింది.

ఉపాధి బకాయిలకై ధర్నాలు

ప్రజాశక్తి - అమలాపురం / పార్వతీపురం టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కార్మికులకు ఒక్కొక్కరికి ఆరు నుంచి ఏడు వారాల బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంపైనే ఆధారపడి వేలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నెలల తరబడి వేతన బకాయిలు ఉంచడం తగదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధిని హార్టీకల్చర్‌కు అనుసంధానం చేస్తూ మంత్రి పవన్‌కల్యాణ్ సంతకం చేయడం అన్యాయమన్నారు. దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. ఇతర రంగాలకు నిధులను మళ్లిస్తే ఉపాధి కార్మికులకు పనులు ఎక్కడ కల్పిస్తారని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పనులన్నింటినీ గుర్తించి ఉపాధి హామీ చట్టంలో చేర్చాలని సూచించారు.

రెండు పూటలా పని నిబంధన రద్దు చేయాలని ధర్నా

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద ఉపాధి కార్మికులు ధర్నాలు చేశారు. పార్వతీపురంలో జరిగిన ధర్నాలో సిఐటియు నాయకులు రెడ్డి వేణు, జి.వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.రాము మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టం కింద చేస్తున్న పనులు రెండు పూటలా చేయాలనే నిబంధనను రద్దు చేయాలని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కొమరాడ ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఎపిఒకు వినతి పత్రాలు అందజేశారు.



అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దడాల సుబ్బారావు

4న బంద్ జయప్రదం చేయాలి

- విద్యార్థి సంఘాల పిలుపు
- పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థి సంఘాల కేంద్ర కమిటీ పిలుపునిచ్చిన విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీలు పిలుపునిచ్చాయి. నీట్, నెట్ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజ్‌లపై సమగ్ర విచారణ జరపాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జులై 4న విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు, ఎన్‌ఎస్‌యుఐ, పిడిఎస్‌యు, పిడిఎస్‌యు, పిడిఎస్‌ఒ సంఘాల నాయకులు పోస్టరును సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎ అశోక్, ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్, కిరణ్, ఐసా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. నీట్, నెట్ లీకేజ్‌లతో లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని చెప్పారు. ఐదేళ్లుగా 65 పేపర్లు లీక్ అయ్యాయని, కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని విమర్శించారు. ఇవన్నీ తెలిసి కూడా కేంద్ర విద్యాశాఖ మంత్రిపై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వన్ నేషన్, వన్ ఎగ్జామ్ అనే ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థ కుప్పకూలిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఎన్‌టిఎను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సిహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమర జవాన్ల కుటుంబాలకు రూ.కోటి చొప్పున సాయం : జగన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లడాఖ్‌లో యుద్ధ ట్యాంకు కొట్టుకుపోయిన ప్రమాదంలో జవాన్లు ప్రాణాలు కోల్పోవడం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు జవాన్లు మరణించడం విచారకరమని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రమాదంలో కృష్ణా జిల్లా పెడన మండలం చేవెంద్ర గ్రామానికి చెందిన సాదరబోయిన నాగరాజు, ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కాల్వపల్లె గ్రామానికి చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి ముత్తుముల రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లా రేపల్లె మండలం ఇస్లాంపూర్‌కు చెందిన సుభాన్‌ఖాన్‌ల కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు. వీరి అంత్యక్రియల్లో పాల్గొని వారి కుటుంబాలకు బాసటగా నిలవాలని వైసిపి నియోజకవర్గ నేతలను కోరారు.

మాజీ మంత్రి 'చెల్లుబోయిన' తల్లి మృతి పట్ల సంతాపం

మాజీ మంత్రి, వైసిపి సీనియర్ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తల్లి చెల్లు బోయిన సుభద్రమ్మ మరణం పట్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

రికార్డు స్థాయిలో పింఛన్ల పంపిణీ

- మొదటి రోజునే 95 శాతం మందికి అందజేత
- సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమర్థవంతమైన నాయకత్వం, ఆదర్శవంతమైన నాయకుడు వుంటే ప్రభుత్వ ఉద్యోగులు ఎంత స్ఫూర్తిదాయకంగా పనిచేస్తారనేదానికి సోమవారం జరిగిన పెన్షన్‌ల పంపిణీ ప్రక్రియనే నిదర్శనమని సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈ పెన్షన్‌ల పంపిణీని సమర్థవంతంగా పనిచేయగలిగిన వ్యవస్థ ప్రభుత్వంలో వున్నప్పటికీ ఏప్రిల్ నెలలో అప్పటి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా, రాజకీయంగా బురద జల్లడం కోసం వలంటీర్లు లేకపోతే పెన్షన్లు పంపిణీ చేయడం సాధ్యం కాదని కొంతమంది ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో ఒకేరోజు 12 గంటల పరిధిలో 95 శాతం మందికి పెన్షన్లు అందించిన సచివాలయ ఉద్యోగులతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులను అభినందిస్తూ ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. గతంలో తాము సచివాలయ ఉద్యోగులతో పెన్షన్‌ల పంపిణీ ప్రక్రియ చేపట్టాలని కోరితే గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించారు. చిత్తశుద్ధితో కనీస ప్రయత్నం కూడా చేయకుండా అమాయకుల ప్రాణాలు తీసిందన్నారు. 65.18 లక్షల లబ్ధిదారులకు 28 కేటగిరిలో దాదాపు రూ.4,408 కోట్ల పంపిణీ లక్ష్యంగా పెట్టుకుని 61.76 లక్షల మంది లబ్ధిదారులకు దాదాపు రూ.4,170 కోట్లను పంపిణీ చేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయంగా ఈ పెన్షన్‌ల ప్రక్రియ నిలిచిపోతుందన్నారు. గతంలో 85 శాతానికి మించి ఏనాడూ పంచలేకపోయారన్నారు. రాష్ట్రంలో రూ.35తో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పెన్షన్ ప్రారంభిస్తే రూ.వెయ్యికి, రూ.రెండు వేలకు తీసుకెళ్లిన ఘనత చంద్రబాబుది అని అన్నారు. మళ్లీ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కేవలం 15 రోజుల్లో రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచిందన్నారు.

డిఎస్‌సిలో ఎస్‌జిటి పోస్టులు పెంచాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సిలో ఎస్‌జిటి పోస్టుల సంఖ్యను పెంచాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కె శశిధర్‌కు ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు సోమవారం లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం 16,347 పోస్టుల భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ చెప్పిన విధంగా డిసెంబరు నాటికి పూర్తిచేయాలని కోరారు. నోటిఫికేషన్‌లో ఎస్‌జిటి పోస్టులు నెల్లూరు, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాల్లో తక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రకాశంలో 124, నెల్లూరులో 104, శ్రీకాకుళంలో 144 మాత్రమే ఉన్నాయని వివరించారు. ఐదేళ్లుగా నోటిఫికేషన్ లేకపోవడంతో అనేక మంది అభ్యర్థులు అవకాశాలు కోల్పోయారని తెలిపారు. కావున వయోపరిమితి 47 ఏళ్లుగా చేయాలని కోరారు. గతంలో డిఎస్‌సిలో ఎంపికైన ఉపాధ్యాయులు రెండేళ్లపాటు అప్రంటీస్ విధానం చేయాల్సి వచ్చేదని తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా అప్రంటీస్ విధానం రద్దయిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో రెండేళ్ల అప్రంటీస్ విధానం తిరిగి ప్రవేశపెడతామని పేర్కొన్నారు. కొత్తగా వచ్చే నోటిఫికేషన్‌లో అప్రంటీస్ విధానం లేకుండా ఇవ్వాలని కోరారు.

పాత చట్టాల కిందే ఒకటికి ముందు నేరాల విచారణ : అమిత్ షా

న్యూఢిల్లీ : నూతన నేర చట్టాలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చినట్లు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. 2024 జులై 1 ముందు జరిగిన నేరాల విచారణ పాత నేర చట్టాల కిందే జరుగుతుందని తెలిపారు. సోమవారం న్యూఢిల్లీలో అమిత్‌షా విలేకరులతో మాట్లాడారు. పాత చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్‌ఎస్‌ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బిఎస్‌ఎ)ను మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. జులై 1, ఆ తరువాత జరిగిన నేరాలన్నీ నూతన చట్టాల కిందే విచారణ జరుగుతుందని చెప్పారు. 'టెక్నాలజీ ఇంకా అన్ని పోలీస్‌స్టేషన్లకు అందలేదని నేను అంగీకరిస్తున్నా, కానీ బిఎన్‌ఎస్ దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది' అని చెప్పారు. భారతీయ సాక్ష్య అధినియం (బిఎస్‌ఎ)ను అన్ని కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ ఆగస్టు 15లోగా అమల్లోకి తీసుకురావడానికి కొంత సన్నద్ధత అవసరమని, కానీ బిఎన్‌ఎస్, బిఎన్‌ఎస్‌ఎస్‌కు అది అవసరం లేదని కేంద్ర మంత్రి చెప్పారు.

కవిత బెయిల్ పిటిషన్లు తిరస్కరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన రెండు వేర్వేరు బెయిల్ పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. కుంభకోణంలో ప్రమేయం ఉందన్న ఆరోపణలతో మార్చి 15న కవితను ఇడి అధికారులు అరెస్టు చేశారు. ఏప్రిల్ 11న సిబిఐ విచారణ కోసం రెండు రోజులు కస్టడిలోకి తీసుకున్నారు. ఆ తరువాత ఆమెను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆమె ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. సిబిఐ, ఇడి కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలని ఆమె ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసింది. విచారణ జరిపిన న్యాయస్థానం బెయిల్ నిరాకరిస్తూ తీర్పు ఇచ్చింది.

రాష్ట్రానికి కేంద్రం చేయూత ఇవ్వాలి

- టిడిపి నేత లావు శ్రీకృష్ణదేవరాయలు

న్యూఢిల్లీ బ్యూరో: ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. సోమవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు 90 శాతం సీట్లు, 56 శాతం ఓట్లతో ఎన్‌డిఎ కూటమిని గెలిపించారని చెప్పారు. పోలవరం, అమరావతి నిర్మాణం వేగంగా పూర్తి చేయడానికి నిధులివ్వాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన రెవెన్యూ గ్రాంట్స్ విడుదల చేయాలన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన విద్యా సంస్థల నిర్మాణం వేగంగా చేయాలన్నారు.

రాష్ట్రాల అధికారాలు నిర్వీర్యం

- బిజెపితో రాముడు లేడు...
- రాజ్యసభలో సిపిఎం నేత జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై ప్రతిపక్షాలు విరుచుకుపడ్డాయి. సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ.. మైనారిటీలను అవమానిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ సహా బిజెపి నేతలు తమ ప్రమాణ స్వీకారాన్ని చేశారని అన్నారు. రాజస్థాన్‌లోని బాన్సువాడలో మోడీ ప్రసంగిస్తూ.. ముస్లిములను చొరబాటుదారులుగా, ఎక్కువ మంది పిల్లలకు జన్మనిచ్చేవారిని అవమానించారని అన్నారు. బిజెపి బుల్‌డోజర్ పార్టీగా మారుతోందని, కమలం చిహ్నాన్ని బుల్డోజర్‌గా మార్చవచ్చునని వ్యాఖ్యానించారు. మొరాదాబాద్‌లో నిన్న ఐదిళ్లు నేలమట్టమయ్యాయని విమర్శించారు. బిజెపితో శ్రీరాముడు లేడని ఎన్నికలు రుజువు చేశాయన్నారు. రామమందిరం నిర్మించిన ఫైజాబాద్‌లో బిజెపి ఓడిపోయిందని, నాథూరామ్ బిజెపితో ఉన్నారని, శ్రీరాముడు కాదని విమర్శించారు. అయోధ్యకు వెళ్లిన మోడీ మణిపూర్ వైపు వెనుదిరిగి చూడలేదని అన్నారు. కేంద్రం నిర్వహించే అన్ని పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నాయని, లక్షల మంది విద్యార్థులు కలలు కల్లోలం అయ్యాయని, పరీక్షల నిర్వహణను రాష్ట్రాలకే వదిలేయాలని డిమాండ్ చేశారు. దక్షిణాది విద్యార్థులకు ప్రవేశాన్ని నిరాకరించడానికి జెఎన్‌యు సహా కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో కొత్త ప్రవేశ పరీక్షను ప్రవేశపెట్టారని విమర్శించారు. పాఠ్యపుస్తకాలు కవిత్వీకరించబడ్డాయని, గాంధీజీ జ్వరంతో చనిపోయారని, ఆస్పత్రికి నాథూరామ్ తీసుకెళ్లారని బోధిస్తారని వ్యాఖ్యానించారు. రాష్ట్రాల అధికారాలను లాక్కొని ఆర్థికంగా కుంగదీస్తోందని, కేరళ, కర్ణాటక నిరసనలు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎలక్టోరల్ బాండ్ స్కామ్‌తో బిజెపికి వేల కోట్లు వచ్చాయని, కోచింగ్ సెంటర్లు, బీఫ్ కంపెనీలు కూడా బిజెపికి బాండ్లు ఇచ్చాయని విమర్శించారు.

బ్రిట్టాస్ ప్రసంగానికి ఛైర్మన్ అంతరాయం

రాజ్యసభలో ధన్యవాద తీర్మానం సందర్భంగా జాన్ బ్రిటాస్ ప్రసంగానికి ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ పదేపదే అంతరాయం కలిగించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకులకు ప్రశ్నాపత్రాలు లీక్ అవుతున్నాయన్న వ్యాఖ్యలను రికార్డు నుంచి తొలగించాలని బ్రిట్టాస్‌ను ధన్‌ఖర్ కోరడంతోపాటు ఆయన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ అనే పదం ఎప్పటి నుంచి 'అన్‌పార్లమెంటరీ'గా మారిందని బ్రిట్టాస్ ఛైర్మన్‌ను ప్రశ్నించారు. బ్రిట్టాస్ ప్రసంగం తప్పుదారి పట్టించిందని, దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారని ధన్‌ఖర్ అన్నారు. మీరు తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని బ్రిట్టాస్ తిప్పికొట్టారు. ఛైర్మన్ స్వయంగా ప్రసంగాన్ని అడ్డుకోవడం సరైన చర్య కాదని అన్నారు. బిజెపి సభ్యులు కూడా పలుమార్లు జోక్యం చేసుకున్నారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ, మహువా మొయిత్రా, ఎ రాజా, మనీష్ తివారీ తదితరులు, రాజ్యసభలో మల్లికార్జున్ ఖర్గే, సంజయ్ సింగ్, మనోజ్ ఝా, తిరుచ్చి శివ తదితరులు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మంగళవారం లోక్‌సభలో చర్చకు ప్రధాని మోడీ సమాధానం ఇవ్వనున్నారు.

సంపాదకీయం


పోలవరం దారెటు?

ఆంధ్రప్రదేశ్‌కు ప్రతిష్టాత్మకంగా చెప్పబడుతున్న పోలవరం ప్రాజెక్టుపై టిడిపి కూటమి ప్రభుత్వం వెలువరించిన శ్వేతపత్రంలో నిర్వాసితుల పరిహారం, పునరావాసానికి ప్రాధాన్యమివ్వకపోవడం ఆందోళనకర విషయం. రాష్ట్రానికి జీవనాడిగా అభివర్ణిస్తున్న ప్రాజెక్టు కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన లక్షల మంది నిర్వాసితుల గురించి సర్కారు పొడిపొడి మాటలతో దాటవేయడం అమానవీయం. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్వాసితుల పునరావాసంపై పదేళ్లుగా దోబూచులాడుతున్న, నిధులివ్వకుండా తాత్సారం చేసిన, ప్రాజెక్టు నిర్మాణంలో చోటు చేసుకున్న అవకతవకల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఒక్కటంటే ఒక్క మాట శ్వేతపత్రంలో ఉదహరించకపోవడం సరికాదు. ఒక వైపు తప్పులు చేసిన మోడీ ప్రభుత్వాన్ని కాపాడుతూ మరోవైపు గత వైసిపి ప్రభుత్వ ప్రమాదకర ధోరణులను ఎత్తిచూపి, అంతకుముందు తన హయాంలో అద్భుతాలు చేశామని పేర్కొన్నారు. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉండి, తనపై కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆధారపడ్డ స్థితిలో కూడా కేంద్రం నుంచి నిధులు సాధిస్తామనికానీ, గట్టిగా నిధులు అడుగుతామనికానీ శ్వేతపత్రంలో కనీసమాత్రమైనా ముఖ్యమంత్రి చెప్పలేదు.

టిడిపి, వైసిపి రెండు ప్రభుత్వాలూ పోలవరం అంటే డ్యామ్ నిర్మాణం, ఇతర సివిల్ పనులుగా చూశాయే తప్ప ప్రాజెక్టు కోసం ఊళ్లూ, ఇళ్లు, భూములు త్యజించిన నిర్వాసితుల గోడు పట్టించుకోలేదు. రిజర్వాయర్ వలన లక్షా ఆరు వేల కుటుంబాలు మునుగుతాయని ఎప్పుడో ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన 2005లో అంచనా వేశారు. రెండు దశాబ్దాల అనంతరం సామాజిక ఆర్థిక సర్వే పేరిట ముంపు కుటుంబాలను 96 వేలకు కుదించినట్లు శ్వేతపత్రంలో వెల్లడించారు. ఎగువ కాఫర్ డ్యాం కట్టాక కొద్దిపాటి వరదలొస్తే చాలు కాంటూరు సర్వేల కంటే అదనపు ప్రాంతాలు మునుగుతున్నాయి. ఇంకోవైపు ఈ ఇరవై ఏళ్ల కాలంలో జనాభా పెరిగింది. 18 ఏళ్లు నిండిన వారూ పెరిగారు. జనాభా, కుటుంబాలు పెరుగుతుండగా, నిర్వాసితులయ్యే కుటుంబాలను తగ్గించడం వెనకున్న మర్మం ఏమిటో అర్థం కాదు. ఎక్కడేకాని ప్రాజెక్టులు గాలిలో కట్టరు. అభివృద్ధిలో భాగంగా ప్రాజెక్టులు నిర్మించేటప్పుడు వాటి వలన నిర్వాసితులయ్యే వారందరికీ పూర్తి స్థాయిలో పునరావాసం కల్పించాకనే నిర్మాణం ప్రారంభించాలన్నది సహజ న్యాయసూత్రం. అంతర్జాతీయ చట్టాలూ అదే చెబుతున్నాయి. దశల పేరిట నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామనడం త్యాగధనుల పట్ల ప్రభుత్వాల అమానవీయతను సూచిస్తుంది.


గత ప్రభుత్వ నిర్లక్ష్యం, అనాలోచితం, అవకతవకల వలన పోలవరం స్తంభించినందున తొలి దశకు నాలుగేళ్లు పడుతుందని శ్వేతపత్రంలో టిడిపి సర్కారు తెలిపింది. తొలి దశ నిర్వాసితుల పునరావాసం రెండేళ్లలో పూర్తవుతుందని, రెండవ దశ పునరావాసం ఆపై దశలవారీగా కొనసాగుతుందని వెల్లడించింది. ఇన్నేళ్లయినా పునరావాసం కోసం పోరాడుతున్న గిరిజన, పేద నిర్వాసితులకు దరిదాపుల్లో పునరావాసం దక్కదని ప్రభుత్వ శ్వేతపత్రంతో అర్థమైపోయింది. తొలి, మలి దశల్లో పునరావాసానికి ఇంకా రూ.25 వేల కోట్లు కావాలంటోంది ప్రభుత్వం. మొదటి ప్రాధాన్యతలో ఆ నిధులు కేంద్రం నుంచి రాబట్టే విషయంలో మాత్రం నాలిక మడత పెడుతోంది. డిజైన్ల దగ్గర నుంచి అంచనాల వరకు, కాఫర్ డ్యాము నుంచి డయాఫ్రంవాల్, గైడ్‌బండ్, రివర్స్‌టెండర్ల వరకు అన్నీ కేంద్ర సంస్థల కనుసన్నల్లోనే జరిగాయి. కాబట్టి టిడిపి, వైసిపి, ఏ ప్రభుత్వం తప్పు చేసినా కేంద్ర అండదండలు పుష్కలంగా ఉందన్నది స్పష్టం. జాతీయ ప్రాజెక్టు బాధ్యత కేంద్రానిదే అయినందున పోలవరంలో తప్పిదాలకు బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం, దాని అధీనంలో కేంద్ర సంస్థలు తప్పించుకోజాలవు. అవకతవకలకు బాధ్యులైన వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. దశలతో నిమిత్తం లేకుండా ఒకేసారి నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాలి. ముంపుపై శాస్త్రీయ సర్వే చేసి నిర్ధారించాలి. ఆగస్టులో గోదావరికి వరదల ముప్పు ఉన్నందున ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలి. అందుకు యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలి.

మహనీయుల మాట



నిజం చెప్పడానికి
ఎంతో ధైర్యం ఉండాలి.
అలాగే ...
నిజాన్ని ఒప్పుకోవడానికి కూడా
అంతకు మించిన
ధైర్యం ఉండాలి.
- ఆర్.కె.నారాయణ్,
రచయిత.

పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదరికం-ప్రత్యేకతలు



ఇప్పుడు మన దేశంలో దాదాపు 80 కోట్ల మంది ప్రజానీకానికి నెలకు తలా 5 కిలోల చొప్పున ఆహారధాన్యాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇందులో ఎంతమేరకు కింది దాకా సవ్యంగా అందుతోంది అన్న విషయంగాని, ఎంతకాలం ఈ పథకాన్ని కొనసాగిస్తారు అన్న విషయంగాని చూడాల్సిందే. అదలా ఉంచితే ఇటువంటి స్కీముని శాశ్వతంగా కొనసాగిస్తే అదే పేదరికాన్ని పరిష్కరిస్తుంది అని భావించడం పొరపాటు. పేదరికాన్ని ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలో లేకుండా చేయాలంటే, అందరికీ ఉపాధిని కల్పించడం, విద్య, వైద్యం, వృద్ధాప్యంలో భద్రత, ఆహారం కల్పించడం జరగాలి. అప్పుడే పేదలు కోల్పోయిన తమ ఆత్మగౌరవాన్ని తిరిగి పొందగలుగుతారు. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో తామూ సమాన భాగస్వాములమేనని అనుకోగలుగుతారు. కాని ఈ పనులు జరగాలంటే అది నయా ఉదారవాద పెట్టుబడిదారీ చట్రాన్ని అధిగమించి బైటపడాల్సిందే. నయా ఉదారవాద విధానాలు అమలులో ఉన్నంతకాలమూ ఎన్ని సహాయ కార్యక్రమాలు చేసినా, వాటి ద్వారా పేదరికాన్ని నిర్మూలించడం మాత్రం సాధ్యం కాదు.



ప్రభాత్ పట్నాయక్

ఆర్థిక వ్యవస్థ అనేది ఏ కాలం నాటిదైనా, పేదరికం అనేది ఒకే విధంగా ఉంటుంది అనే అభిప్రాయం కొందరికి ఉంది. కొంతమంది పేరుగడించిన ఆర్థికవేత్తలు సైతం ఇదే అభిప్రాయంతో ఉంటారు. కాని అంతకు మునుపు ఉన్న వ్యవస్థలతో పోల్చితే పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదరికం పూర్తి విభిన్నంగా ఉంటుంది. ఉత్పత్తి విధానం ఏదైనప్పటికీ, కొన్ని కనీస అవసరాలను పొందగలిగే స్తోమత గనుక లేకుంటే దానిని పేదరికంగా గణాంకవేత్తలు పరిగణిస్తారు. ఐతే, పెట్టుబడిదారీ వ్యవస్థకు స్వత:సిద్ధమైన సామాజిక సంబంధాల ఫలితంగా కేవలం కనీస అవసరాలను పొందలేని పరిస్థితి మాత్రమే గాక తీవ్రమైన అభద్రత, ఆత్మగౌరవాన్ని సైతం కోల్పోయే పరిస్థితులు ఏర్పడతాయి. ఇదంతా కలిసి ఆ పేదరికపు స్థితిని దుర్భరం చేస్తాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థలోని పేదరికానికి నాలుగు లక్షణాలు ఉంటాయి. **మొదటిది:** వారి పరిస్థితులతో నిమిత్తం లేకుండా ప్రభుత్వానికి వారు చెల్లించవలసినది తప్పనిసరిగా చెల్లించితీరాలి. దీని వలన వాళ్ళు తమకున్న ఆస్తులను పోగొట్టుకుని, మరింత పేదరికంలోకి దిగజారి చివరికి దిక్కు లేనివారుగా అయిపోతారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు మునుపు ఉన్న వ్యవస్థలో, ఉదాహరణకు, మొఘల్ చక్రవర్తుల కాలంలో రైతులు ప్రభుత్వానికి తాము పండించిన పంటలో ఒకానొక భాగాన్ని శిస్తుగా చెల్లించవలసి వుండేది. అంటే పంటలు సరిగా పండని కాలంలో వాళ్ళు తక్కువ మొత్తంలో శిస్తు చెల్లించేవారు. పంటల దిగుబడి తగ్గినందువలన పడే భారాన్ని రైతులు కొంత, రాజు కొంత పంచుకునేవారు. కాని బ్రిటిష్ హయాంలో నెలకొన్న పెట్టుబడిదారీ విధానంలో పండిన పంటతో నిమిత్తం లేకుండా కేవలం కొంత భూభాగాన్ని ఉపయోగించి వ్యవసాయం చేయడానికి అనుమతి పొందినందుకుగాను, భూమిశిస్తు చెల్లించవలసిన విధానం అమలులోకి వచ్చింది. పంటలు పండినా, పండకపోయినా, ఈ శిస్తు మాత్రం తప్పదు. అంటే కరువు, కాటకాల భారాన్ని ప్రభుత్వం పంచుకోదు. పేదలే భరించాలి. ప్రభుత్వానికి రావలసిన ఆదాయం తగ్గదు. ఆ శిస్తులు చెల్లించలేక క్రమంగా రైతులు అప్పులపాలై, తమ భూములను వడ్డీ వ్యాపారులకు కోల్పోయి మరింత దిగజారిపోయేవారు. ఆ విధంగా పేదలు తమకుండే కొద్దిపాటి భూమినీ కోల్పోయి దిక్కూ మొక్కూ లేని స్థితికి దిగజారడం పెట్టుబడిదారీ విధానంలో ఒక లక్షణంగా మనకి కనిపిస్తుంది. జరిగిన ఉత్పత్తిలో ఒక భాగాన్ని చెల్లించే పద్ధతి బదులు దానితో నిమిత్తం లేకుండా, ఉత్పత్తి జరిగినా, జరగకపోయినా ఒక నిర్ణీత మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సిందే. ఈ సూత్రం కారణంగా పేద రైతులు తమ భూములను వడ్డీ వ్యాపారుల పరం చేసి నిరాధారంగా మరింత దారిద్ర్యంలోకి దిగజారిపోవడం జరుగుతుంది. అంటే పెట్టుబడిదారీ విధానం పేదలను దరిద్రం లోంచి బైటకు లాగేందుకు కాక, వారిని మరింత దారిద్ర్యం లోకి నెడుతుంది. పేదరికంలో ఉన్నవారి వినియోగ శక్తిని పెంచే బదులు, వారి దగ్గర మిగిలి వున్న కొద్దిపాటి సంపదను సైతం హరిస్తుంది. ఇది ఏదో యథాలాపంగా జరిగే ప్రక్రియగా కాకుండా, పెట్టుబడిదారీ వ్యవస్థలో నిబిడీకృతమై ఉండే ప్రక్రియగా మనం చూడాలి.

ఇక **రెండవ లక్షణం**: పెట్టుబడిదారీ దశలో పేదలు వ్యక్తులుగానో, వ్యక్తిగత కుటుంబాలుగానో ఆ పేదరికపు ఈతి బాధల్ని భరిస్తారు. అదే అంతకు ముందున్న సమాజాలలో ఏదైనా కష్టం వస్తే ఒక సమూహంగా-అది కుల సమూహంగా కాని, లేదా మొత్తం గ్రామ ప్రజలంతా కాని- దానిని భరించే పరిస్థితి ఉండేది. ముఖ్యంగా కరువు కాటకాల సమయంలో ఇది వ్యక్తం అయేది. పెట్టుబడిదారీ సమాజంలో వ్యక్తి లేదా వ్యక్తిగత కుటుంబం ఒక స్వతంత్ర ఆర్థిక యూనిట్‌గా పరిగణించబడుతుంది. అందుచేత ఈ సమాజంలో పేదలు ఆ పేదరికపు కష్టాలను వ్యక్తులుగా, తమ సమూహంతో సంబంధం లేకుండా ఎవరికి వారుగా అనుభవించాల్సి వుంటుంది.

మార్క్సిస్టులు తప్ప తక్కిన ఆర్థికశాస్త్ర నిపుణులు ఎవరూ ఈ తేడాలను చూడలేరు. ఎందుకంటే వారికి చారిత్రక పరిశీలన ఉండదు. చరిత్ర పట్ల గుడ్డితనాన్ని ప్రదర్శించే సాంప్రదాయ ఆర్థికవేత్తలను మార్క్స్ నిశితంగా విమర్శించాడు. ఒక వ్యక్తిని అతడు లేదా ఆమె జీవించివున్న కాలంతో, అప్పటి పరిస్థితులతో నిమిత్తం లేకుండా చూడడం, ఏ కాలంలోనైనా వ్యక్తి అదే వ్యక్తిగా మార్పు లేకుండా ఉంటాడని అనుకోవడం సాంప్రదాయ ఆర్థికవేత్తల విధానం. నయా సాంప్రదాయ ఆర్థికవేత్తలైన కార్ల్ మెంజెర్, స్టాన్లీ జివోన్స్ వంటి వారు కూడా వ్యక్తిని అతడి చుట్టూ ఉండే సామాజిక పరిస్థితుల నుండి విడదీసి కాలానికి అతీతమైన "వ్యక్తి" చుట్టూ తమ ఆర్థిక విశ్లేషణలను అల్లేవారు. ఆ కారణంగా వీరంతా పెట్టుబడిదారీ వ్యవస్థలోని పేదరికానికి, అంతకు పూర్వపు దశలలోని పేదరికానికి గల తేడాను చూడలేకపోయారు. వ్యక్తిగా పేదరికపు ఈతిబాధలను ఒంటరిగా భరించడానికి, సామూహికంగా అంతకు ముందుకాలంలో భరించినదానికి తేడా వారి పరిగణనలో లేదు.

సమూహం నుండి విడిపోయిన, పరాయీకరణ చెందిన వ్యక్తులుగా పెట్టుబడిదారీ దశలో పేదలు ఉంటారు. ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడడానికి వారు మళ్ళీ సంఘాల రూపంలో సామూహిక ప్రతిఘటనలకు పూనుకునే వరకూ ఇదే పరిస్థితి ఉంటుంది. ఆ విధంగా ఒంటరిగా మిగిలిపోవడం వలన పేదరికపు ఈతిబాధలనే గాక, వాటి పర్యవసానంగా కలిగే తీవ్ర మానసిక ఒత్తిళ్ళకు కూడా వారు లోనవుతారు.

ఇక **మూడో లక్షణం** గురించి చూద్దాం. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒకవైపు హీనమైన వేతనాలతో పనులు చేసేవాళ్ళు, మరోవైపు ఉద్యోగ అవకాశాలే లేనివాళ్ళు ఉంటారు. ఇలా అవకాశాలు లేనివాళ్ళనే రిజర్వు సైన్యం అంటాం. ఈ రిజర్వు సైన్యానికి పేదరికపు కష్టాలు మరీ ఎక్కువగా ఉంటాయి. భారతదేశంలోనైతే ఉపాధి పొందుతున్న వాళ్ళకి, రిజర్వు సైన్యానికి మధ్య విభజనరేఖ స్పష్టంగా ఉండదు. కొద్దిమంది తప్ప తక్కినవారందరూ కొన్ని రోజులు పనుల్లో ఉంటారు, మరికొన్ని రోజుల్లో వాళ్ళకి పనులు దొరకవు. దొరికిన రోజుల్లో కూడా పూర్తి గంటలపాటు పనులు దొరకవు. పనులు దొరకకపోవడం వలన కలిగే మానసిక ఒత్తిడులు వారందరి మీదా తీవ్ర ప్రభావం చూపుతాయి. ఎవరికైనా పని దొరకలేదంటే అది అతడి లేదా ఆమె వ్యక్తిగత వైఫల్యంగా కనిపిస్తుంది. అందుచేత ఆ పరిస్థితి వారి ఆత్మగౌరవాన్ని బలంగా దెబ్బ తీస్తుంది. పేదరికం వలన కలిగే కష్టాలకు ఇది అదనం.

నాలుగో లక్షణం: తాము ఎందువలన పేదరికంలో మగ్గవలసి వచ్చిందో ఆ కారణాలు పేదలకు స్పష్టంగా తెలియకపోవడం. అంతకు ముందున్న సమాజాల్లో జరిగిన ఉత్పత్తి ఎంతో, దానిలో భూస్వామి లేదా రాజు ఎంత వాటా పట్టుకుపోతున్నాడో స్పష్టంగా కళ్ళ ముందు కనపడేది. ఒకవేళ ఉత్పత్తి తగ్గితే దానివలన తమ అవసరాలను ఏమేరకు కుదించుకోవలసి వస్తుందో వారికి స్పష్టంగా తెలిసేది. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో తమకు ఎందుకు ఉపాధి దొరకడం లేదో అందులో జీవించే పేదలకు తెలియదు. అలాగే ఉన్నట్టుండి ధరలు ఎందుకు పెరుగుతాయో, దాని ఫలితంగా అనేకమంది పేదరికపు ఊబిలో ఎందుకు దిగబడిపోతారో ఆ పేదలకే అంతుబట్టని ఒక రహస్యంగా మిగిలిపోతుంది.

1943లో బెంగాల్‌లో సంభవించిన కరువు మీద సత్యజిత్ రే 'దూరపు ఉరుము' అనే చిత్రాన్ని తీశారు. కరువు విజృంభించక మునుపే, జపాను సైన్యాలు సింగపూర్ ను ఆక్రమించిన అనంతరం, బెంగాల్‌లో ధరలు ఎలా పెరిగాయో అందులో వివరించారు. ఇప్పుడు కూడా ఉక్రెయిన్ యుద్ధం ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఆహారధాన్యాల ధరలు పెరుగుతున్నాయి. దాని పర్యవసానాలు ఆఫ్రికాలోనో, ఇండియాలోనో మారుమూల ప్రాంతాల్లో నివసించే పేదలు అనుభవిస్తున్నారు. పెట్టుబడిదారీ విధానంలో పేదరికం ఎందుకు కలుగుతుందో, దాని మూలాలు ఎక్కడున్నాయో పైకి కనపడవు. కాని ప్రపంచంలో ఎక్కడెక్కడో జరిగే పరిణామాల పర్యవసానాలు వేరే ఎక్కడో మారుమూల జీవించే ప్రజల మీద పడుతున్నాయి. దీనికి కారణం పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా మూల మూలకూ విస్తరించి సంబంధాలు నెలకొల్పుకోవడం. ఇది అంతకు పూర్వం ఉన్న సమాజాల్లో లేదు.

నేను పైన పేర్కొన్న నాలుగు ప్రత్యేక లక్షణాల కారణంగా ఎటువంటి పర్యవసానాలు ఉంటాయి అన్నది చూడాలి. ఇక్కడ నేను ఒక్కదాని గురించి మాత్రమే ప్రస్తావిస్తాను. చాలామంది సదుద్దేశం ఉన్నవాళ్ళు దేశంలో పేదరికం తగ్గాలన్నా, లేకపోతే పూర్తిగా నిర్మూలించబడాలన్నా, అందుకోసం ప్రభుత్వం బడ్జెట్‌లో పేదలకు కేటాయింపులు పెంచి వారి అందేట్టు చూడాలని అంటారు. తద్వారా అందరికీ సార్వత్రిక కనీస ఆదాయం వచ్చేట్టు చేయగలుగుతామని అంటారు. కాని ఈ విధంగా పూర్తి స్థాయిలో ఎక్కడా ఇంతవరకూ జరగలేదు. అందుచేత ఒక సామాజిక సమస్యగా పేదరికం కొనసాగుతూనే వుంది. పైగా ఇటీవల మరింత పెరుగుతోంది కూడా. నయా ఉదారవాద విధానాల ఫలితంగా ఆహారధాన్యాల ధరలు పెరగడం, అదే సమయంలో ఆర్థికమాంద్యం నెలకొనడం మనం చూస్తున్నాం. ఈ నేపథ్యంలో పేదలకు తోడ్పాటు అందించే విధానాన్ని ఎక్కడైనా అమలు చేసినా, అది చాలా స్వల్పంగానే ఉంది. ఐతే ఈ పరిష్కారం ఏ సమాజంలోని పేదరికానికైనా ఒకేవిధంగా వర్తించేటటువంటిది. సహాయం అందించడం ద్వారా పేదలకు ఊరట కలిగించడం అనేది పెట్టుబడిదారీ సమాజంలోనే కాదు, అంతకు పూర్వపు సమాజాలలో కూడా అదే ఫలితాన్ని ఇస్తుంది. మరి పెట్టుబడిదారీ సమాజానికి సంబంధించిన పేదరికపు ప్రత్యేక లక్షణాలను ఈ చర్య (ప్రభుత్వం సహాయపడడం) ఏ విధంగా పరిష్కరిస్తుంది? వ్యక్తిగత ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసే నిరుద్యోగం ఫలితంగా కలిగే మానసిక వేదనను ఈ విధమైన సహాయ చర్యలు ఏ విధంగా పరిష్కరించగలుగుతాయి? అందుచేత పెట్టుబడిదారీ వ్యవస్థ కారణంగా ఏర్పడే పేదరికాన్ని తొలగించడానికి ఒకే పరిష్కారం సార్వత్రికంగా ఉపాధిని కల్పించడం. కీన్స్ మహాశయుడు పెట్టుబడిదారీ వ్యవస్థ లోపలే అందరికీ ఉపాధి కల్పించడం సాధ్యం అనే అభిప్రాయాన్ని కలిగి వుండేవాడు. కాని అతడి అభిప్రాయం తప్పు అని తేలిపోయింది. నేనీ విధంగా చర్చిస్తున్నానంటే దానర్థం ప్రభుత్వం నుండి ఏ ఆర్థిక సహాయమూ పేదలకు అందించకూడదని ఎంతమాత్రమూ కాదు. అటువంటి సహాయం ఎంత అందించినా, అది ఈ సమాజంలో పేదరికానికి మూలం ఏమిటో దానిని పరిష్కరించలేదు అని నేను చెప్పదలిచాను.

ఇప్పుడు మన దేశంలో దాదాపు 80 కోట్ల మంది ప్రజానీకానికి నెలకు తలా 5 కిలోల చొప్పున ఆహారధాన్యాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇందులో ఎంతమేరకు కింది దాకా సవ్యంగా అందుతోంది అన్న విషయంగాని, ఎంతకాలం ఈ పథకాన్ని కొనసాగిస్తారు అన్న విషయంగాని చూడాల్సిందే. అదలా ఉంచితే ఇటువంటి స్కీముని శాశ్వతంగా కొనసాగిస్తే అదే పేదరికాన్ని పరిష్కరిస్తుంది అని భావించడం పొరపాటు. పేదరికాన్ని ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలో లేకుండా చేయాలంటే, అందరికీ ఉపాధిని కల్పించడం, విద్య, వైద్యం, వృద్ధాప్యంలో భద్రత, ఆహారం కల్పించడం జరగాలి. అప్పుడే పేదలు కోల్పోయిన తమ ఆత్మగౌరవాన్ని తిరిగి పొందగలుగుతారు. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో తామూ సమాన భాగస్వాములమేనని అనుకోగలుగుతారు. కాని ఈ పనులు జరగాలంటే అది నయా ఉదారవాద పెట్టుబడిదారీ చట్రాన్ని అధిగమించి బైటపడాల్సిందే.

నయా ఉదారవాద విధానాలు అమలులో ఉన్నంత కాలమూ ఎన్ని సహాయ కార్యక్రమాలు చేసినా, వాటి ద్వారా పేదరికాన్ని నిర్మూలించడం మాత్రం సాధ్యం కాదు. **(స్వేచ్ఛానుసరణ)**

కవిత్వం

మారని బతుకులు

ఏ రంగు గుడ్డ
ఎంతెత్తు ఎగిరి పడినా
అంతంతే మా బతుకులు
సల్లకు పోతే తప్ప
పాలు పెరుగవవు అన్నట్టు
చేయి చాస్తే గానీ
కరువు కుండ నిండదు.
గాలికెగిరిన వాగ్దానం – తిరిగి తిరిగి
ముళ్ళకంపలో ఇరుక్కున్నట్టు
ఎదురు చూసే కళ్ళు కింద
నలుపు చార నవ్వుకున్నాది
ఊపి ఊపి నిద్రపుచ్చే
ఊరించే పథకాల పాటకు
ఎగతాళం వేసినట్టయినాది.
కాకి ఎంగిలి మెతుకుల్నే
చేయి మార్చి తినే జీవనానికి
ఏ ఏలిక వచ్చినా అంతేమరి
మారని బతుకుల కుంపటి
కడవరకూ మోస్తూ
బడుగుల ఊపిరి
ఉసూరుమంటూ ఆగిపోతోంది
రాతలెన్ని మారినా
మా తల రాత మారట్లేదు.
గతుకుల దారిలో – ఇరుకు సందుల్లో
కాళ్ళాడించక తప్పట్లేదు
బుడ్డీల్లేని చీకట్లో
గుడ్డి బతుకులు వెలగట్లేదు
రాజులు మారినా
అదే కత్తి అదే గుర్రం అదే సైన్యం
అవే యుద్ధాలు
మార్పు లేదు చేర్పు లేదు.

-నరెద్దుల రాజారెడ్డి,
9666016636

వ్యాధుల కాలం...

జంధ్యాల రఘుబాబు

ఆరోగ్యం బాగా క్షీణిస్తోంది యాద్‌గిరి.

ఏమైంది బాగానే కనిపిస్తున్నావు కదా నర్సింగ్.

నా ఆరోగ్యం గురించి కాదు యాద్‌గిరీ...

మరి....

ప్రజల ఆరోగ్యం..

అంతే కదా, ఇప్పుడు సీజన్ మారింది. దోమలు పెరుగుతాయి. మలేరియాలు అవీ వస్తాయి. ఇది వ్యాధుల కాలం నర్సింగన్నా.

మనమేమీ చేయలేమా


ఎందుకు చేయలేము? ఎక్కడికక్కడ ప్రజల్ని జాగ్రత్తగా ఉండమని, దోమలు ఎక్కువ కాకుండా చూసుకొమ్మని సైన్సును ప్రచారం చేసే సంస్థలు చెప్తున్నాయి కదా. అందులో కలిస్తే సరి.

అంతేనా

అంతేగాక.... ఎవరో వస్తారని చూడొద్దు బ్రో. మనమూ కలుద్దాం వాళ్లతో.

పద మరి.

♦♦♦



ఇక చదువులు, చరిత్ర, సంస్కృతికి చెందినవాటిలో కూడా వైరసు ప్రవహిస్తోంది. వాటిని మార్చి విద్యార్థుల పాఠ్యాంశాల్లో పెట్టి ... మన చరిత్ర ఇది కాదు అది అని ...మెల్లమెల్లగా వైరస్‌ను ఎక్కించాలని చూస్తున్నారు. వేమన చెప్పినట్టు వేరు పురుగు చేరి వృక్షంబు చెరచును, చీడ పురుగు చేరి చెట్టు జెరచు, కుత్సితుండు చేరి గుణవంతు చెరచురా అన్నట్లు వేరుపురుగులు, చీడపురుగులు విజృంభిస్తున్న కాలమిది. అందరం జాగ్రత్తగా ఉండాలి.

నర్సింగన్న చెప్పినట్టే ఇది వ్యాధుల కాలం. ముఖ్యంగా అంటువ్యాధుల కాలం. వర్షాలు పడి, కాలువల్లో, గుంతల్లో దోమలు పెరిగి, ఎక్కడెక్కడున్న కాలుష్యమంతా నీళ్లలో కొట్టుకొచ్చి, అవి మంచి నీటిలో కలిసి, వైరల్ జ్వరాలు, మలేరియాలు, వాంతులు, విరేచనాలు ఇలా ఒకటేమిటి అన్నీ మనిషిని ఒక్కసారిగా చుట్టు ముట్టే కాలం. ఇప్పుడొచ్చేవే కాక ఈ పాటికే ఉన్న వ్యాధులు అలాగే ఉంటాయి. వాటితో పోరాడుతూనే కొత్తవాటినీ పారదోలే క్రమంలో ఉండాలి మనమంతా. ఇలా ప్రజల్ని పట్టి పీడిస్తున్న రోగాలేమిటో ఒక్కసారి తెలుసుకుందామన్న ప్రయత్నంలో చాలా చాలా వ్యాధులు బయటపడ్డాయి మనసులోంచి. అవన్నీ జాగ్రత్తగా చూద్దాం. సమాజంలో ప్రజల మనసులను అనారోగ్యం పాలు చేసి వాళ్లను కులాలు, మతాల పేరు మీద విడగొట్టి సామాజిక వర్గం అన్న ఆరోగ్యకరంగా కనిపించే పేర్లు పెట్టి మరీ అనారోగ్యాన్ని మనసుల్లోకి పంపుతున్నారు. అలా విడగొట్టి ఏకం చేసినవాళ్లతో ఓట్లు వేయించుకొని తమ ఆరోగ్యాలు బాగా చూసుకుంటున్నారు రాజకీయ నేతలు. ఇక చదువులు, చరిత్ర, సంస్కృతికి చెందినవాటిలో కూడా వైరసు ప్రవహిస్తోంది. వాటిని మార్చి విద్యార్థుల పాఠ్యాంశాల్లో పెట్టి...మన చరిత్ర ఇది కాదు అది అని...మెల్లమెల్లగా ఆ వైరస్‌ను ఎక్కించాలని చూస్తున్నారు. వేమన చెప్పినట్టు వేరు పురుగు చేరి వృక్షంబు చెరచును, చీడ పురుగు చేరి చెట్టు జెరచు, కుత్సితుండు చేరి గుణవంతు చెరచురా అన్నట్లు వేరుపురుగులు, చీడపురుగులు విజృంభిస్తున్న కాలమిది. అందరం జాగ్రత్తగా ఉండాలి.

మనుషులుగా మనం రోజూ సమాజంలో తిరుగుతూ ఉంటాము. ఎందరినో కలుస్తుంటాము. వాళ్లలో మిత్రులు, బంధువులు, తెలిసినోళ్లు, సాటి ఉద్యోగులు, టీచర్లు, సాటి మనుషులకు వైద్యం చేసే డాక్టర్లు, రోడ్లు, బ్రిడ్జీలు వేసే ఇంజనీర్లు, వాళ్ల చేతి కింద కూలీలు, బస్సు డ్రైవరన్నలు, కండక్టర్లు, వ్యాపారం చేసుకునే వాళు ,, సినిమా హాళ్లలో పనిచేవాళ్లు ఇలా రకరకాలుగా సేవలు చేసేవాళ్లు ఉన్నారు. మొన్ననే ఉస్మానియా ఆసుపత్రి, గాంధీ ఆసుపత్రుల్లో గదులు సరిగా లేవని, బాత్ రూములు, టాయిలెట్లు సరిగా లేవని, పై కప్పు పేషెంట్లపై పడేలా ఉందని, ఒక్కో మంచంపై నలుగురు రోగులు పడుకోవడంతో ఒకరి రోగాలు ఒకరికొస్తున్నాయని, వీళ్లందరికీ సేవలు చేసే జూనియర్ డాక్టర్లు తమ సమస్యను కూడా తీసుకొని సమ్మె చేసి కొన్ని సాధించుకున్నారు. చెప్పకుండానే చూసుకోవలసిన ప్రభుత్వాలు ఎంత అనారోగ్యంతో ఉంటే ఇంత అలసత్వంగా ఉంటాయి చెప్పండి.

నిజంగా మనిషి ఆరోగ్యం బాగాలేకపోతే అన్నీ ఉన్నా లేనట్టే అని మనకు రోజూ శుభోదయం సందేశాల్లో వస్తూ ఉంటాయి. మనిషి మొదట తన ఆరోగ్యం, కుటుంబ ఆరోగ్యం చూసుకుంటాడు. అది కామన్. కొందరు ప్రజల ఆరోగ్యం కూడా చూసుకుంటారు. అది అసాధారణం, వారి గురించి తెలియని వారికి. తెలిసినోళ్లకు ఆశ్చర్యమేమీ లేదు. ఈ మధ్య బొర్రా గోవర్ధన్ పుస్తకమొకటి చదుతుంటే అందులో రాశారు. మెదడువాపు వ్యాధి పంది వల్ల వస్తుంది, అందుకే పందులను చంపేయండి అనే మేధావులున్నారు. కానీ...పంది, గుర్రం, పశువులు ఇలా అన్నింటిలోకీ దోమలు వైరసు గుడ్లను పెట్టి పొదిగిస్తాయి. మళ్లీ వాటి నుండి మనుషుల్లోకి వైరసు ఎక్కించి, తమ నోట్లోని లాలాజలంలో పెట్టుకొని వ్యాపించేలా చేస్తాయి దోమలు. మొత్తం మీద రకరకాల జంతువులను కుట్టినా ముఖ్య కారణం దోమ వల్లే ఆ వైరసు వ్యాపిస్తుంది తప్ప ఆ జంతువులు సీదాగా వచ్చి మనుషులకు వ్యాధి తెప్పించవు. అందుకే దోమల్ని నివారించడం ముఖ్యం. అప్పుడు అందరి మెదళ్ల ఆరోగ్యం బాగుంటుంది. రోగమెలా వస్తుందో, దానికి సరైన కారణమేమిటో కనుక్కోవడం ఇక్కడ ముఖ్యం.

అలా రకరకాల చోట్ల పని చేస్తున్న వాళ్లు తమ సమస్యలతో పోరాడుతున్నారు. వాళ్లందరూ కులం, మతం అని చూసుకోవడం లేదు. అంతా ఒక వర్గం అనుకొని పోరాడుతున్నారు. అందుకే వాళ్లంతా కలిసి వాళ్లు పని చేసే చోట ఉన్న రోగాల్ని వాళ్లే నయం చేసువాలనుకుంటున్నారు. అక్కడ వాళ్ల కులం, మతం ఏదైనా...డాక్టర్లు, ఇంజనీర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, కూలీలు, టీచర్లు, మునిసిపాలిటీ ఉద్యోగులు ఇలా అందరూ ఒక్కటే. అది అసలైన వర్గం, వాళ్లు అంతా కలిసి సమ్మె చేస్తున్నది అసలైన మార్గం. ఏ రోగాలూ వాళ్ల మెదళ్లలో ప్రవేశించవు అలాంటి సమయాల్లో. తరువాత కూడా వాటి నుండి జాగ్రత్తగా ఉండాలి. అప్పుడే నిజమైన ఆరోగ్యం. కాకపోతే కొత్త కొత్త రోగాలొస్తుంటాయి. ఇంకా కొత్త కొత్త మందుల్ని మనం కనిపెడుతూ ఉండాలి. ఇది ముందే వ్యాధుల కాలం మరి.

/ రచయిత సెల్ : 9849753298 /

జనవాక్యం

అన్యాక్రాంతమైన ఆస్తులు

వైసిపి హయాంలో ప్రభుత్వ ఆస్తులను అన్యాక్రాంతంగా అసమ్మదీయులకు కట్టబెట్టినట్టు నివేదికలు తెలియజేస్తున్నాయి. ప్రభుత్వ కార్యాల యాలకు, టిడ్కో ఇళ్ళకు అధికార పార్టీ రంగులు, ఎటువంటి సలహాలు ఇవ్వని సలహాదారులకు, న్యాయస్థానాల్లో ప్రభుత్వం తరపున వాదించిన న్యాయవాదులకు వేల కోట్లు నజరానా చెల్లింపు, ఇసుక, మద్యం, ప్రభుత్వ కార్యాలయాలూ తనఖా పెట్టడం గతంలో ఎప్పుడూ జరగలేదు. అలాగే రుషికొండలో ఆదాయాన్నిచ్చే రిసార్ట్స్ కూల్చి ఆరు వందల కోట్ల ప్రజాధనంతో ప్రజలకు ఏ మాత్రం ప్రయోజనం లేని ప్యాలెస్‌ల నిర్మాణం, కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఏడాదికి వెయ్యి రూపాయలు నామమాత్రపు అద్దెకు పదుల సంఖ్యలో పార్టీ కార్యాలయాలు నిర్మాణం వంటివి రాష్ట్రాన్ని దివాళా తీశాయి. అన్యాక్రాంతంగా దోచేసిన ఆస్తులను విజిలెన్స్ ద్వారా జప్తు చెయగలిగితే ప్రజలకే మాత్రం ఆర్థిక భారం లేని రాష్ట్రంగా ఒడ్డుకు తేవచ్చు. అదే జరగక పోయినట్లైతే ప్రజా ప్రతినిధులందరూ ఒకే తానులో ముక్కలుగా వివేకవంతులైన రాష్ట్ర ప్రజలు అనుమానించే దుస్థితి ఏర్పడే ప్రమాదముంది. దోచేసిన ఆస్తులను ఎంతటి వారైనా జప్తు చేయాలని, అక్రమాలు చేసిన అధికారులకు పదవీ విరమణ చేసిన తర్వాత ప్రభుత్వ రాయితీలు పింఛన్‌లు జీవితాంతం చెల్లించకుండా చట్టం చేయగలిగితే భవిష్యత్తులో ఏ ప్రభుత్వోదోగీ తన విధుల్లో తోక జాడించే అవకాశం ఉండదు. అక్రమార్కులపై కొరడా ఝుళిపించండి! అన్యాక్రాంతమైన ఆస్తులు కాపాడండి!

- యర్రమోతు ధర్మరాజు.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

నూతన విద్యా విధానం రద్దుచేయాలి

- ముస్లింలపై దాడులను తిప్పికొట్టాలి
- సిపిఎం కేంద్రకమిటీ పిలుపు

న్యూఢిల్లీ : విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్రమైన మానసిక క్షోభకు గురిచేసేలా జాతీయ ఎన్‌టిఎ నిర్వహించిన నీట్ పరీక్ష అతి పెద్ద కుంభకోణమని సిపిఎం పేర్కొంది. ఎన్‌టిఎను తక్షణమే రద్దు చేయాలని కోరింది. విద్యను కేంద్రీకృతం చేస్తూ తీసుకువచ్చిన కొత్త విద్యా విధానం పట్ల తీవ్ర విముఖత వ్యక్తం చేసింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సమీక్షించింది. దేశవ్యాప్తంగా మైనారిటీలపై జరుగుతున్న దాడులను ఖండించింది. ఇందుకు సంబంధించిన కేంద్ర కమిటీ ఈ క్రింది ప్రకటన విడుదల చేసింది.

18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సమీక్ష

ఇటీవల జరిగిన 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై కేంద్ర కమిటీ కూలంకషంగా చర్చించింది. ఈ ఫలితాలు బిజెపిని తీవ్రంగా దెబ్బతీశాయని అభిప్రాయపడింది. జీవనోపాధి పరిస్థితులు దారుణంగా క్షీణించడం పట్ల తీవ్రంగా ఆందోళనలు వ్యక్తం చేస్తూ, అలాగే రాజ్యాంగాన్ని, దేశ లౌకిక ప్రజాస్వామ్య స్వభావాన్ని పరిరక్షించేందుకు గాను ప్రజలు గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగా ఈసారి బిజెపికి మెజారిటీ ఇవ్వలేదు. 400కి పైగా సీట్లు ఇవ్వాలని పదే పదే బిజెపి నేతలు చేసిన ప్రకటనలను తిరస్కరిస్తూ, కేవలం 240సీట్లతో సరిపెట్టారు. 2019 లోక్‌సభలో కన్నా ఇవి 63సీట్లు తక్కువ.. మొత్తమ్మీద బిజెపి 92 సిట్టింగ్ సీట్లు కోల్పోయింది. కానీ 29కొత్త సీట్లను గెలిచింది. అంటే నష్టపోయింది 63సీట్లు. దీంతో మెజారిటీ కన్నా 32సీట్లు తక్కువ వచ్చాయి. అయితే, మిత్రపక్షాలు అదనంగా 52సీట్లను గెలవడంతో 292మంది ఎంపీల మద్దతుతో నరేంద్ర మోడీ ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అవసరమైన మెజారిటీ కన్నా కేవలం 20సీట్లే ఎక్కువ.

ఇండియా బ్లాక్ పార్టీలన్నీ కలిసి 234సీట్లు సాధించాయి.. మెజారిటీ కన్నా 38సీట్లు తక్కువ. ఎన్‌డిఎ కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు 42.5శాతం ఓట్లు వచ్చాయి. ఇండియా బ్లాక్ పార్టీలకు మొత్తంగా 40.6శాతం ఓట్లు వచ్చాయి. ఇక్కడ రెండు కూటముల మధ్య ఓట్ల తేడా 2శాతం కన్నా తక్కువగానే అంటే 1.9శాతంగా వుంది. ఇంత ప్రతికూలంగా ఫలితాలు వచ్చినా, సంకీర్ణ ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు వచ్చినా, మోడీ నిరంకుశత్వాన్ని తిరిగి స్థాపించేందుకు బిజెపి నిరంతరం దాడులు చేస్తోంది. మొత్తంగా ఓటు వాటా ఒక శాతం కన్నా కొంచెం మేర క్షీణించిందన్న వాస్తవాన్ని దృష్టిలో వుంచుకుని గత దశాబ్ద కాలంగా కొనసాగిస్తూ వచ్చిన హిందూత్వ ప్రచారాన్ని మరింతగా ఉధృతం చేయాలని చూస్తోంది.

మతోన్మాద ధోరణులకు మరింత పదును పెట్టేందుకు గాను లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుండే ముస్లిం మైనారిటీలపై వరుసగా దాడులు మొదలెట్టింది. మరోవైపు, సిపిఎంతో సహా ప్రతిపక్షాల లక్ష్యంగా చేసుకునేందుకు కేంద్ర సంస్థలను ఆయుధాలుగా మలుచుకోవడాన్ని కొనసాగిస్తోంది. జర్నలిస్టులపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు, కేజ్రీవాల్‌ను తిరిగి సిబిఐ అరెస్టు చేయడం, అరుంధతి రాయ్ ప్రాసిక్యూషన్‌కు అనుమతినివ్వడం వంటి చర్యలు అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్నాయి. జాతీయ భద్రతా సలహాదారు (ఎన్‌ఎస్‌ఎ)ను, ప్రధాని ప్రధాన కార్యదర్శిని పునర్నియమించిన మోడీ జి7 నేతలను కలుసుకునేందుకు ఇటలీ వెళ్ళారు. ఈ సమావేశంలో భారతకు ఎలాంటి ఎజెండా లేదు. ఎన్నికైన మాజీ మంత్రులందరినీ దాదాపుగా తిరిగి కేబినెట్‌లోకి తీసుకుని అవే శాఖలను కేటాయించారు. దాదాపు 150మంది ఎంపీలను సస్పెండ్ చేసిన ఓం బిర్లాను లోక్‌సభ స్పీకర్‌గా తిరిగి ప్రతిష్టించారు. మోడీ నేతృత్వంలో అంతా సాధారణంగానే సాగుతోందన్న భావన కల్పించడానికి తంటాలు పడుతున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో మెజారిటీ ప్రజల జీవనోపాధులను మెరుగుదల కోసం పోరాటాలు చేయడంతో పాటు భారత రాజ్యాంగం, లౌకిక ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, పౌర స్వేచ్ఛ పరిరక్షణ కోసం పార్లమెంట్ లోపల, వెలుపల పోరాటాలను ఉధృతం చేయాలని కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ బృహత్తర కర్తవ్యాన్ని దేశవ్యాప్తంగా ఇతర ప్రజాస్వామ్య పార్టీలతో కలిసి, అలాగే స్వతంత్రంగా సిపిఎం చేపట్టనుంది.

సిపిఎం పనితీరు

మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టడంలో, ఆర్‌ఎస్‌ఎస్, బిజెపికు వ్యతిరేకంగా లౌకికవాద శక్తులను సమీకరించడంలో, తద్వారా ఇండియా బ్లాక్‌ను బలోపేతం చేయడానికి క్రమబద్ధంగా సమీకరించడంలో సిపిఎం కీలక పాత్ర పోషించింది. అయితే, ఎన్నికల్లో పార్టీ పనితీరు నిరాశాజనకంగా వుంది. 2019లో 71 స్థానాలకు పోటీ చేస్తే ఈసారి 52 స్థానాలకు సిపిఎం పోటీ చేసింది. వీటిలో, నాలుగు సీట్లను (తమిళనాడులో రెండు, కేరళ, రాజస్థాన్‌లో ఒక్కోటి) గెలుపొందింది. మొత్తంగా వామపక్షాలు 8సీట్లను గెలుచుకున్నాయి. వీటిలో సిపిఎం 4, సిపిఐ కి 2, సిపిఐ(ఎంఎల్)కు -2 స్థానాలు లభించాయి. పోటీ చేసిన అన్ని రాష్ట్రాల్లో పార్టీ పనితీరును కేంద్ర కమిటీ కూలంకషంగా సమీక్షించింది. తీవ్రమైన స్థాయిలో ఆత్మ పరిశీలన చేపట్టింది. బలహీనతలు, లోటులను, లోపాలను గుర్తించింది. ఈ లోపాలను అధిగమించి, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు రూపొందించిన చర్యలు, కర్తవ్యాల అమలును పార్టీ రాష్ట్ర కమిటీలు ముందుకు తీసుకెళ్తాయి.

పరీక్షల కుంభకోణాలు
విద్యా మంత్రి రాజీనామా చేయాలి

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షల చుట్టూ కమ్ముకున్న కుంభకోణాలతో ప్రభావితమైన లక్షలాదిమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతరులు ఎదుర్కొంటున్న మానసిక ఆవేదన, తగిలిన దెబ్బల పట్ల కేంద్ర కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విద్యను కేంద్రీకరించాలని, వాణిజ్యకరించాలని, వర్గీకరించాలని పేర్కొంటున్న నూతన విద్యా విధానం 2020 పట్ల కేంద్ర కమిటీ తీవ్ర వ్యతిరేకతను పునరుద్ఘాటించింది. పరీక్షల వ్యవస్థను కేంద్రీకృతం చేయడం ఈ డ్రైవ్‌లో భాగంగా వుంది. వ్యాపం కుంభకోణంలో చేసిన మాదిరిగానే ఇందులో కూడా సిబిఐకి దర్యాప్తును అప్పగించడం కేవలం కంటితుడుపు చర్యేనని కేంద్ర కమిటీ అభిప్రాయపడింది.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ఇక పదవిలో కొనసాగే నైతిక హక్కును కోల్పోయారు. తక్షణమే ఆయన తన పదవికి రాజీనామా చేయాలి. అలాగే కేంద్రీకృత పరీక్షా వ్యవస్థను రద్దు చేయాలని కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది. ఎన్‌టిఎను రద్దు చేసి, విద్యా వ్యవస్థను కేంద్రీకృతం చేసే దిశగా తీసుకున్న చొరవలన్నింటినీ ఉపసంహరించుకోవాలని కోరింది.

మైనారిటీలపై దాడులు

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఎదురుదెబ్బలు తిన్న నేపథ్యంలో దేశంలో పలు ప్రాంతాల్లో ముస్లింలపై వారి జీవనోపాధులపై, ఆస్తులపై విచ్చలవిడిగా జరుగుతున్న దారుణమైన దాడులను తీవ్రంగా ఖండించింది.

చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, యుపిలోని అలీగఢ్, గుజరాత్‌లోని చికొద్రాల్లో ముస్లింలపై జరిగిన దాడుల్లో మొత్తంగా ఐదుగురు మరణించారు. గో వధ జరిగిందని, లేదా గొడ్డు మాంసాన్ని స్వాధీనం చేసుకున్నామనే నిరాధార ఆరోపణలతో మధ్యప్రదేశ్‌లోని మాండ్లాలో 11మంది ముస్లింల ఇళ్ళను ధ్వంసం చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని నహన్‌లో ముస్లింకు చెందిన ఒక దుకాణాన్ని ధ్వంసం చేశారు. అనేకమంది దుకాణాలను బలవంతంగా మూసివేయించారు. ఒరిస్సాలోని బాలాసోర్‌లో ఘర్షణ చోటు చేసుకుంది.

గుజరాత్‌లోని వడోదరలో అల్పాదాయ వర్గాల గృహ నిర్మాణ సముదాయంలో తనకు కేటాయించిన ఫ్లాట్‌ను తీసుకోనివ్వకుండా ముస్లిం మహిళను అడ్డుకున్నారు. ఢిల్లీలోని సంగమ్ విహార్‌లో గో కళేబరం దొరికిందంటూ హిందూత్వ సంస్థల కార్యకర్తలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడంతో అక్కడవారు పారిపోయారు. జబల్‌పూర్‌లో ముస్లింలను నగరం వదిలి పారిపోవాలని బెదిరిస్తూ హిందూత్వ సంస్థలు ఒక ప్రదర్శన నిర్వహించాయి.

ఎన్నికల్లో బిజెపి మెజారిటీని సాధించలేని పరిస్థితుల్లో మతోన్మాద దాడులు, ధోరణులు ఇలా పెచ్చరిల్లి పోవడమంటే మరింత ప్రతీకారేచ్ఛతో హిందూత్వ మతోన్మాద శక్తులు రగిలిపోతూ దాడులను ఉధృతం చేస్తున్నాయన్న వాస్తవం స్పష్టమవుతోంది.

బిజెపి, ఇతర మతోన్మాద సంస్థలు పన్నుతున్న ఇటువంటి నీచమైన ఎత్తుగడలు, కుయుక్తులకు వ్యతిరేకంగా అప్రమత్తంగా వుండాల్సిందిగా పార్టీ శాఖలన్నింటికీ సిపిఎం కేంద్ర కమిటీ పిలుపిచ్చింది. ఇటువంటి విషపూరితమైన దాడులు, చర్యలకు వ్యతిరేకంగా పార్టీ శాఖలు తక్షణమే నిరసన కార్యాచరణ చేపట్టాలని కోరింది.

రెండు దశాబ్దాల నాటి కేసులో మేధాపాట్కర్‌కి జైలు

న్యూఢిల్లీ : రెండు దశాబ్దాల నాటి పరువునష్టం కేసులో నర్మదా బచావో ఆందోళన్ (ఎన్‌బిఎ) నేత మేధా పాట్కర్‌కి ఢిల్లీ కోర్టు సోమవారం ఐదు నెలల జైలు శిక్ష విధించింది. రూ.10 లక్షల జరిమానా కూడా విధించింది. తీర్పుపై అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్షను ఒక నెలపాటు నిలుపుదల చేసింది. నర్మదా బచావో ఆందోళనకు వ్యతిరేకంగా ప్రకటనలు ప్రచురించారంటూ అప్పట్లో నేషనల్ కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్ ఎన్‌జిఒకు అధ్యక్షుడిగా ఉన్న సక్సేనాకు పరువు నష్టం కలిగించేలా టివి ఛానల్ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు చేయడంతోపాటు ప్రకటన ఇచ్చారని, 2001లో నమోదు చేసిన కేసులపై తాజాగా కోర్టు తీర్పు ఇచ్చింది.

ఎంపిగా రషీద్ ఇంజనీర్ ప్రమాణ స్వీకారానికి ఎన్‌ఐఎ అనుమతి

న్యూఢిల్లీ : ఉపా కేసులో జైలులో ఉండి ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర ఎంపీగా ఎన్నికైన జమ్ముకాశ్మీర్ అవామీ ఇత్తెహాద్ పార్టీ వ్యవస్థాపకుడు ఇంజనీర్ రషీద్ అలియాస్ షేక్ అబ్దుల్ రషీద్ ప్రమాణ స్వీకారానికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) అనుమతించింది. ఈ నెల 5న ఆయన లోక్‌సభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. రషీద్ మీడియాతో మాట్లాడకూడదని ఎన్‌ఐఎ షరతు విధించింది. ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టు ఈ నెల 2న తీర్పునివ్వనుంది. ఇంజనీర్ రషీద్ ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. యుఎపిఎ చట్టం కింద ఎన్‌ఐఎ 2019లో ఆయనను అరెస్టు చేసింది. ఈ ఎన్నికల్లో రషీద్ తరపున ఆయన కుమారుడు అబ్రర్ రషీద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రషీద్ 2008, 2014లో జమ్ముకాశ్మీర్‌లోని లాంగేట్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఆ యాప్స్‌తో ఇక కరెంట్ బిల్లు కట్టలేరు..! : ఆర్‌బిఐ ఆంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్

చెల్లింపుల యాప్‌ల ద్వారా ఇకపై కరెంట్ బిల్లులను చెల్లించడానికి వీలుండదు. ఇప్పటికే క్రెడిట్ కార్డుల ద్వారా ప్రభుత్వ బిల్లు చెల్లింపులు కుదరవని చెప్పిన రిజర్వు బ్యాంక్, తాజాగా గూగుల్ పే, ఫోన్ పే, పేటియం తదితర యాప్స్ ద్వారా కూడా బిల్లులను అంగీకరించబోమని పేర్కొంది. కరెంటు బిల్లుల్ని తమ సంస్థ అధికారిక వెబ్‌సైట్ ద్వారా గాని, ఆయా కార్యాలయాలకు వెళ్లి గాని చెల్లించాలని ఆర్‌బిఐ స్పష్టం చేసింది.

ఇజ్రాయిల్ మిలిటరీకి మానవ కవచంలా పాలస్తీనా ఖైదీలు

గాజా : ఉత్తర, దక్షిణ గాజా ప్రాంతాల్లో, ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ తన భూతల దాడులను ముమ్మరం చేయడంతో పరిస్థితి దారుణంగా వుంది. గాజాలోని సుజయె ప్రాంతంలో ఇజ్రాయిల్ ట్యాంకులు ముందుకు చొచ్చుకుని వెళుతున్నాయి. పేలుడు పదార్థాల గాలింపు కోసం ఇజ్రాయిల్ మిలటరీ పాలస్తీనా ఖైదీలను మానవ కవచంలా ఉపయోగిస్తున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. సోమవారం విముక్తుడైన పాలస్తీనా ఖైదీ ఫర్జ్ అల్ సమునీ మాట్లాడుతూ, సెంట్రల్ గాజాలోని ఇజ్రాయిల్ చెక్‌పాయింట్ వద్ద గతేడాది నవంబరు 16న తనను నిర్బంధించారని చెప్పారు. హెచ్చరికలతో తాము పారిపోతుండగా, తనను పట్టుకున్నారని, తన కుటుంబాన్ని చంపేశారని చెప్పారు. దర్యాప్తు గదిలోకి ప్రవేశించగానే దర్యాప్తు అధికారి తుపాకీతో కాల్పులు జరుపుతూ ఒక రకమైన భయానక వాతావరణాన్ని సృష్టిస్తారని చెప్పారు. ఇజ్రాయిలీ బందీలు ఎక్కడ వున్నారో చెప్పాలని పదే పదే ప్రశ్నించేవారన్నారు.

రాముడి జన్మస్థలం బిజెపికి గుణపాఠం

- లోక్‌సభలో రాహుల్ గాంధీ
- 'అగ్నివీర్'తో యువకుల ఆత్మ స్థైర్యానికి దెబ్బ : రాజ్యసభలో ఖర్గే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాముడి జన్మస్థలం అయోధ్య ప్రజలు బిజెపిని ఓడించి తగిన గుణపాఠం నేర్పారని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సోమవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. సభలో మొదట వివిధ కమిటీల నియామకాలకు సంబంధించిన ప్రతిపాదనలను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సభ ముందుంచారు. ఆ తరువాత రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు స్పీకర్ ఓంబిర్లా అనుమతించారు. బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్ చర్చను ప్రారంభిస్తూ మోడీ నాయకత్వంపై విశ్వాసంతో దేశ ప్రజలు వరుసగా మూడోసారి ఎన్‌డిఎను గెలిపించారని, మోడీ ప్రభుత్వం పేదరికాన్ని తరిమివేసేందుకు పనిచేస్తోందని అన్నారు.

ఈ తీర్మానంపై రాహుల్ గాంధీ మాట్లాడుతూ రాజ్యాంగంపై దాడిని ఖండించిన వారిపై ఎన్‌డిఎ సర్కార్ దాడులకు దిగుతోందని, కొందరిని వ్యక్తిగతంగా టార్గెట్ చేశారని విమర్శించారు. చేయని తప్పులకు శిక్ష అనుభవిస్తూ కొందరు నాయకులు ఇప్పటికీ జైల్లో ఉన్నారని, పేదలు, దళితులు, మైనారిటీలు, వివిధ వర్గాల ప్రజలపై జరుగుతున్న దౌర్జన్యాలను ప్రశ్నించినందుకు దర్యాప్తు సంస్థలతో తనపైనా దాడులకు తెగబడ్డారని విమర్శించారు. ఇడితో 55 గంటల విచారణ చేయించారని, కానీ ఏమీ లేదని స్పష్టమైందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగాన్ని రక్షించుకున్నామని, ఇప్పుడు బిజెపి నేతలు రాజ్యాంగం ముందు తలవంచి జై సంవిధాన్ అనడం ఆనందంగా ఉందని, రాజ్యాంగానికి రక్షణగా ఉంటామని, అధికారం కంటే నిజం గొప్పదని అన్నారు. అయోధ్య విమానాశ్రయం కోసం భూసేకరణ చేసి రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని, చిరు వ్యాపారుల పొట్టకొట్టారని, దాని ప్రారంభానికి అదానీని పిలిచారని విమర్శించారు. రాములవారి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి సైతం మోడీ ఇదే ధోరణి అవలంబించారన్నారు. అయోధ్య ఉన్న ఫైజాబాద్ ఎంపి నియోజకవర్గంలో ఇండియా ఫోరం నేత ఘన విజయం సాధించారని, రాముడి జన్మస్థలం బిజెపికి గుణపాఠం నేర్పిందని, స్పష్టమైన సందేశం ఇచ్చిందని పేర్కొన్నారు. ఫైజాబాద్‌లో పోటీచేయాలని అనుకున్నా, సర్వేలన్నీ వ్యతిరేకంగా రావడంతో వారణాసి నుంచి మోడీ పోటీ చేశారన్నారు. ఫైజాబాద్ ఎంపి, సమాజవాదీ పార్టీ నేత అవధేష్ ప్రసాద్‌కు రాహుల్ గాంధీ షేక్‌హ్యాండ్ ఇచ్చి.. శభాష్ అని మెచ్చుకున్నారు. అన్ని మతాల్లో ధైర్యం గురించి ఉంటుందని, హిందూ, ఇస్లాం, సిక్కు ఇలా అన్ని మతాలు ఎన్నో విషయాలను బోధిస్తాయని చెప్పారు. శివుని ఫోటో చూపిస్తూ.. తమని తాము 24 గంటలపాటు హిందువులమని చెప్పుకునే వారిలో హింస, ద్వేషం, అసత్యం కురుకుపోయి ఉంటుందని, హిందూ మతం పేరు చెప్పి బిజెపి అందరినీ భయపెడుతోందని అన్నారు. హింసను ప్రేరేపించే వాళ్లు హిందువులే కారని, అసలు వారిని హిందువులని ఎలా అనగలమని ప్రశ్నించారు.

ప్రధాని మోడీ అభ్యంతరం

రాహుల్ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ లేచి అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకొని, ఈ విషయం ఎంతో తీవ్రమైందని, హిందూ సమాజాన్ని హింసాత్మకమని పేర్కొనడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు రాహుల్ బదులిస్తూ.. "నరేంద్రమోడీ ఒక్కరే మొత్తం హిందూ సమాజం కాదు, అలాగే ఆర్‌ఎస్‌ఎస్ ఒక్కటే హిందూ సమాజం కాదు" అని అన్నారు. తాను కేవలం ప్రధాని మోడీని, బిజెపిని, ఆర్‌ఎస్‌ఎస్‌ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేశానని, మొత్తం హిందూ సమాజాన్ని ఉద్దేశించి కాదని స్పష్టం చేశారు.

శివుని ఫోటో నిషేధమా?

రాహుల్ గాంధీ శివుని చిత్రం చూపించడంపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేస్తూ సభలో ప్లకార్డులు, ఫొటోలు ప్రదర్శించడం నిషేధం అని తేల్చి చెప్పారు. ఇందుకు రాహుల్ బదులిస్తూ ఈ సభలో శివుని బొమ్మని చూపించడం నిషేధమా? అని పదేపదే ప్రశ్నించారు. తన మెడకు పాము చుట్టిముట్టినప్పుడు తాను వాస్తవాన్ని అంగీకరిస్తానని శివుడు చెప్పాడని, ఆయన చేతిలో ఉన్న త్రిశూలం అహింసకు ప్రతీక అని వివరించారు. ఒకవేళ హింసకి ప్రతీక అయితే, ఆ త్రిశూలం కుడిచేతిలో ఉండేదని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. తాను శివుని నుంచే ప్రేరణ పొందానని, ప్రతిపక్షంలో ఉన్నందుకు గర్వపడుతున్నానని రాహుల్ పేర్కొన్నారు.



మాది సామాన్యుడి మాట... మోడీది మనసులో మాట
రాజ్యసభలో ప్రతిపక్షనేత ఖర్గే ఎద్దేవా
తుగ్లక్ స్కీమ్ అగ్నివీర్‌ను రద్దు చేయాలి

ప్రతిపక్షాలది సామాన్యుడి మాట అని, ప్రధాని మోడీది మనసులో మాట అని రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. సోమవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో రాష్ట్రపతికి కీలక భూమిక ఉందని, తాము గౌరవిస్తామని చెప్పారు. ఈఏడాది రాష్ట్రపతి తొలి ప్రసంగం జనవరిలోనూ, రెండో ప్రసంగం జూన్‌లోనూ చేశారని, ఎన్నికల కోసం తొలి ప్రసంగం చేస్తే, రెండోది దానికి కాపీ మాత్రమేనని అన్నారు. దళితులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల గురించి ఎక్కడా రాష్ట్రపతి తమ ప్రసంగంలో ప్రస్తావించనే లేదని, రాష్ట్రపతి ప్రసంగానికి ఒక విజన్ కానీ, డైరెక్షన్ కానీ లేదని పేర్కొన్నారు. మణిపూర్ రగులుతుండటడాన్ని ఖర్గే ప్రస్తావిస్తూ, నినాదాలు ఇవ్వడంలో ప్రధానమంత్రి నిపుణుడని, ఏడాదిగా మణిపూర్ రగులుతున్నా ఆ రాష్ట్రంలో ఒక్కసారి కూడా ఆయన పర్యటించలేదని విమర్శించారు. పార్లమెంటు కాంప్లెక్స్‌లోని మహాత్మాగాంధీ, అంబేద్కర్, ఇతర నాయకుల విగ్రహాలను తిరిగి యథాస్థానంలో ఉంచాలని డిమాండ్ చేశారు. అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాలని, ఎలాంటి ప్రణాళిక లేని ఇలాంటి తుగ్లక్ స్కీముల వల్ల యువత మనోస్థైర్యం దెబ్బతిందని అన్నారు.

నీట్‌పై నాలుగు నోటీసులను తిరస్కరించిన రాజ్యసభ ఛైర్మన్

అంతకు ముందు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్షల పేపర్ లీక్ వ్యవహారంపై ఎంపిలు ఇచ్చిన నాలుగు నోటీసులను రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తోసిపుచ్చారు. దీనిపై నిష్పాక్షిక విచారణకు ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించినందున నోటీసులను తిరస్కరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రెండో రౌండ్ దిశగా ఫ్రాన్స్

- మొదటి రెండు స్థానాల్లో లీపెన్, లెఫ్ట్ కూటమి

పారిస్ : మొదటి రౌండ్ ఫ్రెంచ్ పార్లమెంట్ ఎన్నికల్లో మాక్రాన్ నేతృత్వంలోని మధ్యేవాద నయా ఉదారవాద పార్టీ రినైజాన్స్‌కు వామపక్ష, ప్రగతిశీల శక్తులతో కూడిన పాపులర్ ఫ్రంట్ గట్టి షాక్ ఇచ్చింది. 29 శాతం ఓట్లతో పాపులర్ ఫ్రంట్ రెండవ స్థానంలో నిలవగా, మాక్రాన్ పార్టీ మూడవ స్థానంలో నిలిచింది. దీంతో మాక్రాన్‌కు వచ్చే మూడేళ్లు దినదిన గండమే. పచ్చి మితవాద పార్టీ నేషనల్ ర్యాలీకి 34 శాతం ఓట్లు రాగా, మాక్రాన్ పార్టీకి 21 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. లీపెన్ పార్టీకి, పాపులర్ ఫ్రంట్‌కు మధ్య ఓట్ల తేడా కేవలం 5 శాతం మాత్రమే. మొదటి రౌండ్‌లో ఏ పార్టీకి లేదా కూటమికి మెజార్టీకి అవసరమైన 50శాతానికి పైగా ఓట్లు లేదా నమోదయిన మొత్తం ఓటర్లలో 25 శాతం దాకా లభించకపోతే రనాఫ్ ఎన్నికలు అనివార్యం. ఆదివారం జరిగిన ఎన్నికల్లో గత నలభై ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా పోలింగ్ శాతం నమోదయింది. మొదటి రౌండ్‌లో 60 మంది అభ్యర్థులు ఎన్నిక కాగా, వీరిలో నేషనల్ ర్యాలీ నుంచి 38 మంది, పాపులర్ ఫ్రంట్ నుంచి 21 మంది, మాక్రాన్ పార్టీ నుంచి ఇద్దరు ఉన్నారు. ఈ నెల 7న జరిగే రెండో రౌండ్ ఎన్నికల్లో 500 స్థానాలు భర్తీ కావాల్సి ఉంది. ఈసారి హంగ్ పార్లమెంట్ ఏర్పడుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఫలితంగా మరింత రాజకీయ అనిశ్చితి నెలకొంటుందని భావిస్తున్నారు. రద్దైన పార్లమెంట్‌లో నేషనల్ ర్యాలీకి కేవలం 88 సీట్లే వున్నాయి. రెండో రౌండ్ ఎన్నికల్లో లీపెన్ పార్టీకి, పాపులర్ ఫ్రంట్‌కు మధ్య ఓట్లలో అంతరం మరింత తగ్గే అవకాశముంది. వచ్చే నాలుగైదు రోజులు ప్రచారం మరింత ఉధృతం కానుంది. పచ్చి మితవాద శక్తులు బలం పుంజుకోవడం పట్ల ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బర్గ్, లిల్లీ, పారిస్ తదితర నగరాల్లో ఇప్పటికే నిరసనలు, ఆందోళనలను మొదలయ్యాయి. ఈ ప్రదర్శనలకు నాయకత్వ వహించిన న్యూ పాపులర్ ఫ్రంట్ నాయకులు మాట్లాడుతూ, ప్రస్తుతం సాధించిన దాంతో సంబరపడకుండా, రానున్న రోజుల్లో మరింత పెద్దయెత్తున ప్రజలను సమీకరించాల్సిన అవశ్యకత గురించి నొక్కి చెప్పారు. ఈ పోరాటం కొనసాగాలని 'నేషనల్ కో-ఆర్డినేటర్ ఆఫ్ ఫ్రాన్స్ అన్‌బౌడ్' మానియెల్ బంపార్డ్ అన్నారు.



ఆకస్మిక పార్లమెంటు ఎన్నికలకు వెళ్లి చెయ్యి కాల్చుకున్న మాక్రాన్. సొంత పార్టీ మెజార్టీని నాశనం చేసుకుని సంకట స్థితిలో పడ్డారు

కేంద్ర ఏజెన్సీల దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

చర్చ జరపాలని పట్టుబట్టారు. ఈ విషయంపై తాము వాయిదా తీర్మానం కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు. నీట్ అంశంపై చర్చ చేపట్టాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అందుకు స్పీకర్ ఓం బిర్లా నిరాకరించడంతో సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'మేము నీట్‌పై ఒకరోజు మొత్తం చర్చను కోరుతున్నాము. పేపర్ లీక్‌ల వల్ల రెండుకోట్ల మందికిపైగా విద్యార్థులు ప్రభావితులయ్యారు. 70 సందర్భాల్లో పేపర్ లీక్‌లు జరిగాయి. ఈ విషయంలో విద్యార్థులంతా ఆందోళనలో ఉన్నారు. వారికి పార్లమెంట్ నుంచి భరోసా కల్పిస్తూ సందేశాన్ని ఇవ్వాల్సి ఉంది' అని అన్నారు. రాహుల్ అభ్యర్థనను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వ్యతిరేకించారు. ఆ అంశంపై నోటీసు ఇవ్వాలని, బిఎసిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే సమయంలో వాయిదా తీర్మానాలు తీసుకునేందుకు నిబంధనలు అంగీకరించవని అన్నారు. ప్రస్తుత సమావేశాల్లో జీరో అవర్, ప్రశ్నోత్తరాలు లేవని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చిద్దామని పేర్కొన్నారు. తీర్మానాన్ని ఆమోదించిన తరువాత ఇతర అంశాలను లేవనెత్తవచ్చన్న ప్రతిపక్షాల అభ్యర్థనను ఓం బిర్లా తిరస్కరించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. ప్రతిపక్షాలు కోరుతున్న అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎప్పుడు ఏ అంశం చర్చించాలనే దానిపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రస్తుతం చర్చను కొనసాగించాలని రాజ్‌నాథ్ కోరారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభ ముగించే వరకూ ప్రత్యేక చర్చ జరగదని చెప్పారు. దీంతో సభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.



మీకోసం


కారం ఎక్కువ కాలం తాజాగా ఉండాలంటే అందులో ఇంగువ కలుపుకోవాలి.

జీవన సౌరభం

పిల్లలకు క్రమశిక్షణ నేర్పడానికై పెద్దలు ఆదర్శ జీవితం గడపాలి. ఎందుకంటే వారు మనల్నే అనుసరిస్తారు కాబట్టి.

పుస్తకాలు

పుస్తకాలు హస్త భూషణాలు
పుస్తక పఠనం ఉత్తమాభిరుచికి నిదర్శనం
మస్తిష్కానికి ఆహారాలు
మానవతను మేల్కొల్పే కారకాలు
ఆపదల్లో ఉపాయ సూచికలు
ఏకాంతంలో ప్రియనేస్తాలు
యువత భవితకు మార్గదర్శకాలు
విజ్ఞాన వినోద ప్రసాదితాలు
నైతిక విలువల ప్రజ్వలితలు
మాతృభాషా వికాసకాలు
సంస్కృతీ సంప్రదాయాల పరి వ్యాప్తికలు
దురాచారాల నిర్మూలనా అస్త్రాలు
అజ్ఞానాన్ని తొలగించే విజ్ఞాన కిరణాలు
సామాజిక చైతన్య కరదీపికలు
ఇతిహాసపు గాథల నిక్షిప్త గనులు!



- ఆళ్ల నాగేశ్వరరావు,
74166 38823.



సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలను ఆంగ్లంలో ఏమంటారో పక్కనే ఇచ్చాం. అయితే ఆ అక్షరాలు గజిబిజిగా ఉన్నాయి. అర్థవంతమైన పదాలు వచ్చేలా కాస్త మీరు సరిచేసి రాయరూ!

నేను గీసిన బొమ్మ



పి.జస్మిత,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రాంపూర్,
మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కొంగుచాటు బిడ్డ ..
కోట్ల హృదయాలను గెలిచాడు!

దేశంలోనే కాదు, ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆటగాడు జస్ప్రీత్ బుమ్రా. 31 ఏళ్ల ఈ యువ ఆటగాడు ఫాస్టెస్ట్ బౌలర్‌గా ఎన్నో మైలురాళ్లు సాధించాడు. ఓటమి అంచున ఉన్న జట్టును అనేకసార్లు విజయం వైపు నడిపించాడు. నిరాశలో ఉన్న కోట్లాది అభిమానులకు ఫుల్ జోష్ పంచాడు. ఇదంతా అందరికీ తెలిసిందే.. అదంతా నాణేనికి ఒకవైపు. మరో వైపు.. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకుని, ఒంటరి తల్లి పెంపకంలో పెరిగిన పిల్లవాడు బుమ్రా. మహా సిగ్గరి, భయస్తుడు. అతని బాల్యమంతా తల్లి కొంగు చాటునే గడిచింది. అలా.. ఆ అమ్మ కడుపు నుండి బయటపడిన క్షణం నుండి, అతని ప్రతి కదలికను పరిశీలిస్తున్న మరో అమ్మ దీపల్, బుమ్రాను దేశం కీర్తిస్తున్న తీరుకు ఉబ్బితబ్బిబ్బైపోయింది. అతను సాధించిన విజయాన్ని ఆస్వాదిస్తూ తన అంతరంగాన్ని బయటపెట్టింది. ఎన్నో ఏళ్లుగా తన మదిలో పదిలపర్చుకున్న ప్రతి జ్ఞాపకాన్ని ట్విట్టర్ వేదికగా, పంచుకుంది.

వృత్తిరీత్యా జర్నలిస్టు అయిన దీపల్ త్రివేది, జూన్ 30న బుమ్రా గురించి రాసిన ప్రతి అక్షరం.. భావోద్వేగ భరితం.. పట్టుదల, దృఢ సంకల్పంతో పాటు, శక్తివంతమైన ఓ సందేశం కూడా అందులో దాగుంది.

'నాకు క్రికెట్ పరిజ్ఞానం శూన్యం. కానీ సిగ్గుతో ఎప్పుడూ ముడుచుకుపోయే నా బుమ్రాని ఈ రోజు 'లెజెండ్' అని సంబోధిస్తూ ఓ సుదీర్ఘ పోస్టు చేయాలనుకుంటున్నాను. నా 'హీరో' కోసం ఇంతమాత్రం చేయలేనా!' అంటూ దీపల్ రాయడం మొదలుపెట్టింది. బుమ్రా తల్లి దల్జీత్‌కి దీపల్ ప్రాణ స్నేహితురాలు.



బుమ్రా పుట్టినప్పుడు కూడా దీపల్ దల్జీత్ పక్కనే ఉంది. 'ఆ రోజు నాకు ఇప్పటికీ బాగా గుర్తు. 1993 డిసెంబరు నెల. అప్పుడు నా జీతం రూ.800 కంటే తక్కువ. మా ఇంటి పక్కనే దల్జీత్ కుటుంబం నివసిస్తోంది. ఆ రోజు ఆమెకు ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. నన్ను తనతో హాస్పటల్‌కి రమ్మని బలవంతం చేసింది. ఆ రోజంతా నేను హాస్పటల్‌లోనే గడిపాను. బుమ్రా తండ్రి జస్బీర్ చాలా ఆందోళనగా అటూఇటూ తిరుగుతున్నాడు. ఇంతలో లేబర్ రూం నుండి ఓ నర్సు గట్టిగా పిలిచింది. మేం అటువైపుగా వెళ్లాం. తెల్లటి బట్టలో చుట్టిన ఓ పసికందును ఆమె నా చేతుల్లో పెట్టింది. పొత్తిళ్ల బిడ్డను పట్టుకోవడం నాకు అదే మొదటిసారి. బిడ్డవైపే తదేకంగా అలా చూస్తుండిపోయాను. మగ శిశువు. నవ్వడానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ నవ్వడం లేదు. బాగా బక్కగా ఉన్నాడు. ఇప్పటికీ నాకు ఆ క్షణం చాలా బాగా గుర్తు' అని దీపల్ బుమ్రా పుట్టిన క్షణాన్ని గుర్తుచేసుకున్నారు.

పొలిటికల్ రిపోర్టర్‌గా రాణిస్తున్న దీపల్ బుమ్రా గురించి రాసిన పోస్టు చదువుతున్నప్పుడు బాలీవుడ్ సినిమా గుర్తుకొస్తుంది. 'ఇరుగుపొరుగుగా మేము ప్రతిదీ పంచుకునేవాళ్లం. ఐస్‌క్రీం దగ్గర నుండి ప్రతి ఒక్కటీ షేర్ చేసుకునేవాళ్లం. అప్పటికి నాకు సొంత ఫోన్ లేదు. ఫ్రిడ్జ్, మంచం లాంటివేవీ లేవు. అన్నీ బుమ్రా ఇంట్లోనే.. ఆ ఇల్లు నాకు సకల సౌకర్యాలు అనుభవించే వీలు కల్పించింది' అని బుమ్రా కుటుంబంతో ఎంతో సంతోషంగా గడిపిన క్షణాలను గుర్తుచేసుకున్న దీపల్ పోస్టు చదువుతున్నప్పుడు ఒక్కసారిగా విషాదభరిత అంశాలు మొదలయ్యాయి.



'బుమ్రా తండ్రి జస్బీర్ మరణంతో వారి జీవితం తల్లకిందులైంది. మేమంతా ఆశలు కోల్పోయాం. దల్జీత్ ఆ షాక్ నుండి చాన్నాళ్లు కోలుకోలేదు. నెల రోజుల పాటు నేనొక్కదాన్నే బుమ్రాని, వాళ్లక్క జుహికాని సంరక్షించాను. చదువు చెప్పాను. కానీ బుమ్రా చదువుపై శ్రద్ధ చూపేవాడు కాదు. ఓ ప్లాస్టిక్ బంతితో ఆడుతూ ఉండేవాడు. కుటుంబమంతా ఆకలితో అలమటించాం. పస్తులు పడుకున్నాం. బిస్కెట్లు తిని పడుకున్నాం. జుహికాకి విషయాలు కొంచెం కొంచెం అర్థమయ్యేవి. కానీ బుమ్రా పరిస్థితి అలా కాదు. ఆకలితో చాలా ఏడ్చేవాడు. అతని కోసం ఓ చిన్న పాల ప్యాకెట్ కొనడానికి కూడా డబ్బులు ఉండేవి కావు. పరిస్థితులను అధిగమించేందుకు దల్జీత్ ఎన్నో ప్రయత్నాలు చేసింది. రోజుకు 16 నుండి 18 గంటలు కష్టపడి పనిచేసేది' అన్న వాక్యాలు చదువుతున్నప్పుడు బుమ్రా అభిమానులెవరికైనా కళ్లు చెమర్చకమానవు.

'ఇంక్రిమెంట్ వచ్చిన రోజు ఓ కుర్తాని కొనుక్కుందామని షాపుకి వెళ్లాను. కానీ అమ్మ కొంగుచాటున దాక్కుని నా వైపే, నక్కినక్కి చూస్తున్న బుమ్రా కోసం వెచ్చదనం ఇచ్చే స్వెట్టర్ కొన్నాను. అప్పుడతనికి 8 ఏళ్లు. అదే నేను బుమ్రా కోసం కొన్న మొదటి బహుమతి. కొత్త కుర్తా లేకుండా నేను దీపావళి, క్రిస్టమస్, పుట్టినరోజులు చాలా జరుపుకున్నాను. కానీ బుమ్రాకి కొనిచ్చిన ఆ స్వెట్టర్ నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది. రాజ్‌దీప్ రన్వాత్, మనీష్ మల్హోత్రా వంటి దిగ్గజాలు ధరించిన దుస్తులు వేసుకున్న గొప్ప తృప్తినిచ్చింది' అని రాసిన దీపల్ పోస్టు చదువుతున్నప్పుడు ఒక కంట్లో తడి, మరో కంట్లో మెరుపు తప్పకుండా వస్తాయి.

'ఒకప్పటి సిగ్గరి, ఇప్పుడు లెజెండ్. బుమ్రా గురించి తెలుసుకుని ప్రతి ఒక్క భారతీయుడు గర్వపడాలి. నేర్చుకోవాలి. అతని వినయం, మర్యాద అప్పుడూ ఇప్పుడూ ఏం మారలేదు. ఇటువంటి బిడ్డను ఇంత ప్రయోజకారిగా తీర్చిదిద్దిన దల్జీత్ ఎప్పటికీ నా దృష్టిలో గొప్పదే. నా బుమ్రాకి నేను మళ్లీ శుభాకాంక్షలు చెబుతున్నాను. సారీ కన్నా, నేను నీ మ్యాచ్ చూడలేదు.. కానీ నిన్ను చూశాను. ప్రేమించాను..' అని దీపల్ తన పోస్టును పూర్తి చేశారు.

దీపల్ రాసిన ఈ పోస్టు షేర్ చేసిన స్వల్పకాలంలోనే లక్షల వ్యూస్‌ని సొంతం చేసుకుంది. బుమ్రా తన కుటుంబంతో కలిసి ఉన్న ఫొటోలతో సోషల్‌మీడియా వేదికలు నిండిపోయాయి.



బుమ్రా తండ్రి జస్బీర్ వ్యాపారి. అనారోగ్య కారణంగా బుమ్రాకి ఐదేళ్లప్పుడు అతడు మరణించాడు. తల్లీ దల్జీత్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తూ కుటుంబాన్ని పోషించారు. తల్లి పనిచేస్తున్న స్కూల్లోనే బుమ్రా విద్యాభ్యాసం కొనసాగించాడు. పాఠశాల స్థాయి నుండే క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్న బుమ్రాని తల్లి ఆ దిశగా ప్రోత్సహించారు. 2021లో బుమ్రా, గోవా మోడల్, ప్రజెంటర్ సంజనాని వివాహం చేసుకున్నారు. 2023లో బుమ్రాకి ఒక కొడుకు జన్మించాడు. క్రికెట్‌లో అత్యుత్తమ ఆటను ప్రదర్శించే బుమ్రాకి ఎన్నో అవార్డులు, రివార్డులు, ప్రశంసలు దక్కాయి. తాజాగా జరిగిన టీ-20 టోర్నీలో 8 మ్యాచ్‌ల్లో 15 వికెట్లతో బుమ్రా సత్తా చాటాడు. ముఖ్యంగా తుది పోరులో ఓటమి దిశగా సాగుతున్న జట్టును 18వ ఓవర్లో 2 పరుగులే ఇచ్చి, ఓ వికెట్ తీసి గెలుపు వైపు మళ్లించాడు.

కొత్త న్యాయ చట్టాలను రద్దు చేయాల్సిందే..

- పలు జిల్లాల్లో ధర్నాలు, నిరసనలు



అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త న్యాయ చట్టాలు ప్రజల హక్కులను హరించే విధంగా ఉన్నాయని, వాటి అమలును తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పలు జిల్లాల్లో ధర్నాలు నిర్వహించారు. ఆటో రిక్షా కార్మిక సంఘం, మోటార్ వర్కర్స్ యూనియన్, భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసనలు తెలిపారు. కొత్త చట్టాల అమలును ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. జులై 1 నుండి అమలయ్యే నూతన న్యాయ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సత్వర న్యాయం కోసం కొత్త నేర చట్టాలను రూపొందించామని కేంద్రం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొత్త చట్టాలు ప్రజల హక్కులను హరించే విధంగా ఉన్నాయని, వీటి అమలను ఆపకపోతే రాజ్యాంగాన్ని గౌరవించే ప్రతి ఒక్కరు దేశవ్యాప్త ఆందోళన ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విజయనగరం కోట జంక్షన్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ధర్నాలో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎ.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ డ్రైవర్లను క్రిమినల్స్‌ను చేస్తూ ఐదేళ్ల జైలు శిక్ష పడే విధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భారత న్యాయ సంహిత చట్టాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ అలంకార్ సెంటర్, ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు పాల్గొని మాట్లాడారు. కంచికచర్లలో హిట్ అండ్ రన్ కేసును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పలు ఆటో స్టాండ్‌ల వద్ద నిరసనలు నిర్వహించారు. విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం, మోటార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం లంకెలపాలెం కూడలిలో ధర్నా చేశారు.

ఏకైక టెస్టులో భారత్ జయభేరి

- దక్షిణాఫ్రికా మహిళలపై 10వికెట్ల తేడాతో గెలుపు



చెన్నై: దక్షిణాఫ్రికా మహిళలతో చెపాక్ స్టేడియంలో జరిగిన ఏకైక టెస్ట్‌లో టీమిండియా ఘన విజయం సాధించింది. వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికాపై క్లీన్‌స్వీప్ చేసిన అమ్మాయిలు ఏకైక టెస్టులోనూ జూలు విదిలించారు. దక్షిణాఫ్రికా మహిళలు నిర్దేశించిన 37 పరుగుల లక్ష్యాన్ని భారత్ వికెట్ కోల్పోకుండా ఛేదించింది. సంచలన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కుప్పకూల్చిన స్పిన్నర్ స్నేహ్ రానా(8/77, 2/111) 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది. ఫాలోఆన్ ఆడుతూ దక్షిణాఫ్రికాకు ఆదిలోనే షాక్ తగిలింది. ఓవర్‌నైట్ స్కోర్ 2 వికెట్ల నష్టానికి 232 పరుగులతో దక్షిణాఫ్రికా ఫాలోఆన్‌ను కొనసాగిస్తూ.. మరో 141పరుగులు జోడించి చివరి 8వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత 37 పరుగుల స్వల్ప పరుగుల లక్ష్యాన్ని భారత జట్టు అలవోకగా ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో రెచ్చిపోయి ఆడిన షఫాలీ వర్మ(24నాటౌట్), శుభా సతీశ్(13నాటౌట్) రాణించారు.

స్కోర్‌బోర్డు...

ఇండియా మహిళలు తొలి ఇన్నింగ్స్: 603/6డిక్లేర్డ్

దక్షిణాఫ్రికా మహిళల తొలి ఇన్నింగ్స్: 266

దక్షిణాఫ్రికా మహిళల రెండో ఇన్నింగ్స్: వోల్వోడార్డ్ (ఎల్‌బి)గైక్వాడ్ 122, బాట్స్ (ఎల్‌బి)దీప్తి 9, లూస్ (బి)హర్మన్‌ప్రీత్ 109, కాప్ (ఎల్‌బి)దీప్తి 31, టెక్కర్ (సి)రోడ్రిగ్స్ (బి)స్నేహ్ రాణా 0, డికాక్ (బి)గైక్వాడ్ 61, సిమోలా జోఫ్రా (సి)సతీశ్ (బి)స్నేహ్ రాణా 15, అమీ డెర్క్‌సన్ (ఎల్‌బి)పూజ 5, శకుఖునే (రనౌట్)గైక్వాడ్ 6, క్లాస్ (బి)షెఫాలీ వర్మ 2, మాబా (నాటౌట్) 1, అదనం 12. (154.4ఓవర్లలో) 373 పరుగులకు ఆలౌట్ **వికెట్ల పతనం:** 1/16, 2/206, 3/264, 4/266, 5/281, 6/310, 7/324, 8/334, 9/357, 10/373 **బౌలింగ్:** రేణుక 10-1-30-0, స్నేహ్ రాణా 40-12-111-2, పూజ 16-7-35-1, దీప్తి 45-10-95-2, గైక్వాడ్ 30.4-12-55-2, షెఫాలీ 3-1-7-1, హర్మన్ 10-0-31-1.

ఇండియా మహిళల రెండో ఇన్నింగ్స్: శుభా సతీశ్ (నాటౌట్) 13, షెఫాలీ వర్మ (నాటౌట్) 24. (9.2ఓవర్లలో) 37పరుగులు. **బౌలింగ్:** మాబా 5-0-18-0, టెక్కర్ 4.2-0-19-0

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను వారి మాతృశాఖకు బదిలీ చేస్తూ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతిలో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కె ఈశ్వర్‌రెడ్డిని మంగళగిరిలో డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అలాగే కర్నూలు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఎస్‌పి ఎన్ పూజితకు కడప, అనంతపురం జిల్లాల అదనపు బాధ్యతల నుండి తప్పించి డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విజయవాడ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరీముల్లా షరీఫ్‌కు తిరుపతి, కర్నూలు జిల్లాల బాధ్యతలు అప్పగించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె ఈశ్వర్‌రావుకు అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించిన ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం ఎక్స్ వేదికగా విడుదల చేశారు. టెన్త్‌కు 15,058 మంది విద్యార్థులు హాజరుకాగా, 9,531 మంది (63.30 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్‌లో 27,279 మంది విద్యార్థులు హాజరుకాగా, 18,842 (69.07 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలు apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చు. పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారికి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు.

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యత

- ముఖ్యమంత్రికి దక్షిణ మధ్య రైల్వే జిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ కోరారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశాఖ రైల్వేజోన్ అంశాన్ని వివరించారు. దీంతోపాటు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల స్థితిని ముఖ్యమంత్రికి వివరించారు. కేంద్ర, రాష్ట్ర సహకారాలతో జోన్ పరిధిలో ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలో జోన్ ఏర్పాటుకు సంబంధించి స్థలం కేటాయింపు అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. సిఎంను కలిసిన వారిలో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్, గుంటూరు డిఎం ఎం రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వైసిపి బిల్డింగ్ కూల్చివేతపై పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

చట్ట నిబంధనలను అమలు చేస్తామన్న హామీని తుంగలోకి తొక్కి గుంటూరు జిల్లా, తాడేపల్లిలోని వైసిపి స్టేట్ ఆఫీసు బిల్డింగును కూల్చివేసిందంటూ ఆ పార్టీ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. కూల్చివేత చర్యలకు పాల్పడిన సిఆర్‌డిఎ కమిషనర్ కాటంనేని భాస్కర్, మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్లపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంది. ఈ మేరకు గుంటూరు జిల్లా వైసిపి అధ్యక్షులు ఎం శేషగిరిరావు దాఖలు చేసిన పిటిషన్‌లో కాటంనేని భాస్కర్, నిర్మల్ కుమార్‌ను వ్యక్తిగత ప్రతివాదులుగా పేర్కొన్నారు. అధికారులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారని, కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాత కూల్చివేత చర్యలు తీసుకోరాదన్న హైకోర్టు ఉత్తర్వులను కూడా ఉల్లంఘించారన్నారు. ఈ పిటిషన్‌ను వచ్చే వారం హైకోర్టు విచారణ జరిపే అవకాశం ఉంది.

అల్కరాజ్ అలవోకగా..
వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో 3వ సీడ్, స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ తొలిరౌండ్‌లో సునాయాసంగా విజయం సాధించాడు. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ టోర్నమెంట్ తొలిరౌండ్‌లో అల్కరాజ్ 7-6(7-3), 7-5, 6-2తో లాజల్(ఎస్టోనియా)పై సునాయాసంగా నెగ్గాడు. ఇతర పోటీల్లో 8వ సీడ్ రూడ్, 5వ సీడ్ మెద్వదెవ్, 29వ సీడ్ టోఫీ ప్రత్యర్థులను చిత్తుచేసి రెండోరౌండ్‌కు చేరారు. ఐదుసెట్ల హోరాహోరీ పోరులో టోఫీ 6-7(5-7), 2-6, 6-1, 6-3, 6-3తో అన్‌సీడెడ్ అమల్డి(ఇటలీ)పై చెమటోడ్చి నెగ్గాడు. ఇక రూడ్(నార్వే) 7-6(7-2), 6-4, 6-4తో బోల్ట్(ఆస్ట్రేలియా)ను, 5వ సీడ్ మెద్వదేవ్ 6-3, 6-4, 6-2తో కొవాసెవిక్(అమెరికా)ను ఓడించారు. మరో పోటీలో 18వ సీడ్ బీజ్(అర్జెంటీనా) 2-6, 3-6, 4-6తో నకషిమా(అమెరికా) చేతిలో, 19వ సీడ్ జారీ(చిలీ) 1-6, 5-7, 4-6తో అన్‌సీడెడ్ షపొవాలెవ్(కెనడా) చేతిలో వరుససెట్లలో ఓడారు. మరో పోటీలో 22వ సీడ్ మన్నారినో(ఫ్రాన్స్) 4-6, 6-3, 5-7, 4-6తో సహచర ఆటగాడు మోన్‌ఫీల్ చేతిలో పరాజయాన్ని చవిచూశాడు.

ఒసాకా శుభారంభం...

మహిళల సింగిల్స్‌లో జపాన్‌కు చెందిన అన్‌సీడెడ్ ఒసాకా శుభారంభం చేసింది. తొలిరౌండ్‌లో ఒసాకా 6-1, 1-6, 6-4తో పెర్రీ(ఫ్రాన్స్)ను చిత్తుచేసింది. ఇక 8వ సీడ్ జంగ్(చైనా) తొలిరౌండ్‌లో 6-4, 2-6, 4-6తో రడోసికా(ఆస్ట్రేలియా) చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైంది.

ఇతర పోటీల్లో 12వ సీడ్ కీస్(అమెరికా) 6-4, 7-6(7-5) తో ట్రెవిసన్(ఇటలీ)పై, 7వ సీడ్ పోలిని(ఇటలీ) 7-5, 6-3తో టోమ్వో(స్పెయిన్)పై గెలిచి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. ఇక అన్‌సీడెడ్ ప్లిస్కోవా(చెక్) 6-4, 4-6, 5-7తో షానడైర్(రష్యా) చేతిలో అనూహ్యంగా ఓడింది. మరో పోటీలో 9వ సీడ్ సక్కారి(గ్రీక్) 6-3, 6-1తో కాసియెర్(అమెరికా)ను ఓడించింది.

వైజాగ్ వారియర్స్ గెలుపు



ప్రజాశక్తి- పిఎం పాలెం (విశాఖపట్నం)

ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఎపిఎల్) సీజన్-3 వైజాగ్ వారియర్స్ శుభారంభం చేసింది. బెజవాడ టైగర్స్ సోమవారం జరిగిన మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ బరిలోకి దిగిన బెజవాడ టైగర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. మనీష్ గొలమారు 37 బంతుల్లో 44 పరుగులు చేశారు. అనంతరం వైజాగ్ వారియర్స్ 19.1 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్లు బండారు సుజాన్, అశ్విన్ హెబ్బర్ పార్టనర్‌షిప్‌లో 62 పరుగులు చేసి అవుటయ్యారు. తర్వాత దిగిన కెప్టెన్ కె శ్రీకర్ భరత్ మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 23 బంతుల్లో 46 పరుగులు చేసి నాట్ అవుట్‌గా నిలిచాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68